47. [(*)] ఆ (అంతిమ) ఘడియ జ్ఞానం కేవలం ఆయనకే చెందినది.[25] మరియు ఆయనకు తెలియకుండా ఫలాలు పుష్పకోశాల[26] నుండి బయటికిరావు మరియు ఆయనకు తెలియకుండా ఏ స్త్రీ కూడా గర్భం దాల్చదు మరియు ప్రసవించదు. మరియు ఏ దినమునైతే వారిని పిలిచి: "మీరు నాకు సాటి కల్పించే ఆ భాగస్వాములు ఎక్కడున్నారు?" అని అడిగితే, వారు ఇలాజవాబిస్తారు: "మాలో ఎవ్వడు కూడా దీనికి సాక్ష్యంఇచ్చేవాడులేడని మేము ఇదివరకే మనవి చేసుకున్నాము!"

إِلَيْهِ يُرَدُّ عِلْمُ السَّاعَةِ ۚ وَمَا تَخْرُجُ مِنْ
ثَمَرَاتٍ مِنْ أَكْمَامِهَا وَمَا تَحْمِلُ مِنْ أُنْثَىٰ
وَلَا تَضَعُ إِلَّا بِعِلْمِهِ ۚ وَيَوْمَ يُنَادِيهِمْ أَيْنَ
شُرَكَائِي قَالُوا آذَنَّاكَ مَا مِنَّا مِنْ شَهِيدٍ ﴿٤٧﴾

48. మరియు వారు ఇంతకు పూర్వం ఆరాధించేవారంతా వారిని త్యజించిఉంటారు. మరియు తమకు తప్పించుకునే మార్గం లేదని వారు గ్రహిస్తారు.[27]

وَضَلَّ عَنْهُمْ مَا كَانُوا يَدْعُونَ مِنْ قَبْلُ ۖ وَظَنُّوا
مَا لَهُمْ مِنْ مَحِيصٍ ﴿٤٨﴾

49. మానవుడు మేలుకొరకు ప్రార్థిస్తూ ఎన్నడూ అలసిపోడు. కాని ఒకవేళ అతనికి ఏదైనా ఆపద కలిగితే, అతడు ఆశవదలి నిరాశ చెందుతాడు.[28]

لَا يَسْأَمُ الْإِنْسَانُ مِنْ دُعَاءِ الْخَيْرِ وَإِنْ مَسَّهُ الشَّرُّ
فَيَئُوسٌ قَنُوطٌ ﴿٤٩﴾

50. మరియు ఒకవేళ మేము అతనికి ఆపదకాలం దాటిపోయిన తర్వాత మా కారుణ్యాన్ని రుచిచూపిస్తే అతడు తప్ప కుండా ఇలా అంటాడు: "ఇది నా హక్కే! మరియు పునరుత్థానదినం వస్తుందని నేను భావించను. మరియు ఒకవేళ నేను నా ప్రభువు వద్దకు మరలింపబడినా! నిశ్చయంగా నాకు ఆయన దగ్గర మేలే ఉంటుంది." కాని మేము సత్యతిస్కారులకు వారు చేసిన కర్మలను

وَلَئِنْ أَذَقْنَاهُ رَحْمَةً مِنَّا مِنْ بَعْدِ ضَرَّاءَ مَسَّتْهُ
لَيَقُولَنَّ هَٰذَا لِي وَمَا أَظُنُّ السَّاعَةَ قَائِمَةً
وَلَئِنْ رُجِعْتُ إِلَىٰ رَبِّي إِنَّ لِي عِنْدَهُ لَلْحُسْنَىٰ ۚ
فَلَنُنَبِّئَنَّ الَّذِينَ كَفَرُوا بِمَا عَمِلُوا وَلَنُذِيقَنَّهُمْ
مِنْ عَذَابٍ غَلِيظٍ ﴿٥٠﴾

---

25. చూడండి, **7:187** మరియు **79:44**.
26. అక్మామ్: Sheath, Bud, Calyx, పుష్పకోశం, కవచం, ఒర, పొర, తొడిమ.
27. చూడండి, **18:53**.
28. చూడండి, **11:9**.

గురించి వారికి తప్పక తెలుపుతాము మరియు వారికి భయంకరమైన శిక్షను రుచిచూపిస్తాము.

وَإِذَآ أَنْعَمْنَا عَلَى ٱلْإِنسَٰنِ أَعْرَضَ وَنَـَٔا بِجَانِبِهِۦ
وَإِذَا مَسَّهُ ٱلشَّرُّ فَذُو دُعَآءٍ عَرِيضٍ ٥١

51. మరియు ఒకవేళ మేము మానవుణ్ణి అనుగ్రహిస్తే, అతడు మా నుండి విముఖుడై ప్రక్కకు మరలిపోతాడు మరియు ఒకవేళ తనకు ఆపదవస్తే సుదీర్ఘమైన ప్రార్థనలు చేస్తాడు.

قُلْ أَرَءَيْتُمْ إِن كَانَ مِنْ عِندِ ٱللَّهِ ثُمَّ كَفَرْتُم
بِهِۦ مَنْ أَضَلُّ مِمَّنْ هُوَ فِى شِقَاقٍۭ بَعِيدٍ ٥٢

52. ఇలా అను: "ఏమీ? మీరు ఆలోచించారా? ఒకవేళ ఇది (ఈ ఖుర్ఆన్) అల్లాహ్ తరఫునుండి వచ్చిఉండి మీరు దానిని తిరస్కరిస్తే, దానిని వ్యతిరేకించటంలో చాలాదూరం పోయిన వానికంటే ఎక్కువ మార్గభ్రష్టుడెవడు?"

سَنُرِيهِمْ ءَايَٰتِنَا فِى ٱلْءَافَاقِ وَفِىٓ أَنفُسِهِمْ حَتَّىٰ
يَتَبَيَّنَ لَهُمْ أَنَّهُ ٱلْحَقُّ ۗ أَوَلَمْ يَكْفِ بِرَبِّكَ أَنَّهُۥ
عَلَىٰ كُلِّ شَىْءٍ شَهِيدٌ ٥٣

53. ఇక త్వరలోనే మేము వారికి మా సంకేతాలను (ఆయాత్‌లను), వారి చుట్టూ ఉన్న ఖగోళంలో[29] మరియు వారి యందును చూపుతాము; చివరకు ఇదే (ఈ ఖుర్ఆనే) సత్యమని వారికి స్పష్టమవుతుంది. ఏమీ? నీ ప్రభువు! నిశ్చయంగా, ఆయనే ప్రతిదానికి సాక్షి, అనే విషయం చాలదా?

أَلَآ إِنَّهُمْ فِى مِرْيَةٍ مِّن لِّقَآءِ رَبِّهِمْ ۗ
أَلَآ إِنَّهُۥ بِكُلِّ شَىْءٍ مُّحِيطٌۢ ٥٤

54. అదికాదు! నిశ్చయంగా, వారు తమ ప్రభువును కలుసుకునే విషయంపట్ల సందేహంలోపడివున్నారు.జాగ్రత్త!నిశ్చయంగా ఆయన ప్రతిదానిని ఆవరించి ఉన్నాడు.

*****

---

29. ఉదాహరణకు సూర్యచంద్రులు, రాత్రింబవళ్ళు, గాలివానలు మొదలైనవి.

***

42. సూరహ్ అష్-షూరా

سُوْرَةُ الشُّوْرٰى

అష్-షూరా: సలహా. వ'హీ దివ్యజ్ఞాన అవతరణ సత్యమని ఈ సూరహ్ మొదటి మరియు చివరి ఆయతులలో విశదీకరించబడింది. ప్రవక్తలందరూ ఒకే ఒక్క సత్యప్రచారం చేశారు. అంటే అల్లాహ్ (సు.తా.) ఉన్నాడు. ఆయనే! ఒకే ఒక్క ఆరాధ్యుడు మరియు ప్రభువు. ఆయనను పోలినది విశ్వంలో ఏదీలేదు. ఆయనను దేనితోనూ పోల్చలేము. ఆయన వివరణకు అతీతుడు. ఆయన తన సృష్టిపై కారణ పరిణామాల శాసనాన్ని విధించాడు. కావున మానవుడు ఈ జీవితంలో చేసిన దాని ఫలితాన్నే వచ్చే (పరలోక) జీవితంలో అనుభవిస్తాడు. దీనిపేరు 38వ ఆయత్ నుండి తీసుకోబడింది. ఈ అనుక్రమంలో ఇది మూడో సూరహ్. ఇది మక్కాలో అవతరింపజేయబడింది. ఇందులో 53 ఆయతులు ఉన్నాయి.

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

حٰمٓ ﴿١﴾

1. 'హా-మీమ్.

عٓسٓقٓ ﴿٢﴾

2. 'ఐన్-సీన్-ఖాఫ్.

كَذٰلِكَ يُوْحِيْٓ اِلَيْكَ وَاِلَى الَّذِيْنَ مِنْ قَبْلِكَ ۙ اللّٰهُ الْعَزِيْزُ الْحَكِيْمُ ﴿٣﴾

3. (ఓ ము'హమ్మద్!) సర్వశక్తిమంతుడూ, మహా వివేకవంతుడూ అయిన అల్లాహ్, ఇదేవిధంగా నీకూ మరియు నీకంటే ముందు వచ్చినవారికి కూడా దివ్యజ్ఞానం (వ'హీ) అవతరింపజేశాడు.[1]

---

1. ఏ విధంగానైతే దైవప్రవక్త ('స'అస)పై దివ్యజ్ఞానం అవతరింపజేయబడిందో, అదే విధంగా అతనికి ముందు వచ్చిన ప్రవక్తలపై కూడా అవతరింపజేయబడింది. దైవప్రవక్త ('స'అస)పై వ'హీ అవతరణను గురించి, ఒక 'స'హాబీ (ర'ది.'అ.), దైవప్రవక్త('స'అస)ను ప్రశ్నించగా ఇలా అన్నారు: "కొన్ని సార్లు అది (వ'హీ) నా దగ్గరకు ఘంటల శబ్దంవలే వస్తుంది. ఇది చాలా కఠినతరమైనది. అది ఆగిన తరువాత నాకు అంతా కంఠస్తమైపోతుంది. కొన్నిసార్లు దైవదూత ('అ.స.) మానవరూపంలో వచ్చి నాకు చెబుతాడు. అతను చెప్పినదంతా నాకు జ్ఞాపకమైపోతుంది." 'ఆయిషహ్ (ర.'అన్హా) అన్నారు: "నేను విపరీతమైన చలికాలంలో కూడా, వ'హీ అవతరణ ముగిసిన తరువాత, దైవప్రవక్త ('స'అస)ను చెమటలో మునిగి పోవటాన్ని చూశాను. మరియు అతని నుదుటి నుండి చెమట బిందువులు కారటం కూడా చూశాను." ('స'హీ'హ్ బు'ఖారీ).

لَهُ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْأَرْضِ ۖ وَهُوَ الْعَلِيُّ الْعَظِيمُ ④

4. ఆకాశాలలో మరియు భూమిలో ఉన్నదంతా ఆయనకు చెందినదే. ఆయన మహోన్నతుడు, సర్వోత్తముడు.

تَكَادُ السَّمٰوٰتُ يَتَفَطَّرْنَ مِن فَوْقِهِنَّ ۚ وَالْمَلٰٓئِكَةُ يُسَبِّحُونَ بِحَمْدِ رَبِّهِمْ وَيَسْتَغْفِرُونَ لِمَن فِي الْأَرْضِ ۗ أَلَآ إِنَّ اللَّهَ هُوَ الْغَفُورُ الرَّحِيمُ ⑤

5. ఆకాశాలు, పైనుండి దాదాపు ప్రేలి పోనున్నాయి. మరియు దేవదూతలు తమ ప్రభువు పవిత్రతను కొనియాడుతూ, ఆయనను స్తుతిస్తూ ఉన్నారు మరియు భూమిలో ఉన్నవారి కొరకు క్షమాపణ కోరు తున్నారు. చూడండి, నిశ్చయంగా అల్లాహ్! ఆయనే క్షమాశీలుడు, అపార కరుణాప్రదాత.

وَالَّذِينَ اتَّخَذُوا مِن دُونِهِ أَوْلِيَآءَ اللَّهُ حَفِيظٌ عَلَيْهِمْ وَمَآ أَنتَ عَلَيْهِم بِوَكِيلٍ ⑥

6. మరియు ఎవరైతే ఆయనను వదలి ఇతరులను తమ సంరక్షకులుగా చేసు కుంటారో, వారిని అల్లాహ్ కనిపెట్టుకొని ఉన్నాడు. మరియు నీవు వారికి బాధ్యుడవు కావు.[2]

وَكَذٰلِكَ أَوْحَيْنَآ إِلَيْكَ قُرْءَانًا عَرَبِيًّا لِّتُنذِرَ أُمَّ الْقُرَىٰ وَمَنْ حَوْلَهَا وَتُنذِرَ يَوْمَ الْجَمْعِ لَا رَيْبَ فِيهِ ۚ فَرِيقٌ فِي الْجَنَّةِ وَفَرِيقٌ فِي السَّعِيرِ ⑦

7. మరియు ఈ విధంగా మేము నీ పై ఈ ఖుర్ఆన్‌ను, అరబ్బీభాషలో, దివ్యజ్ఞానం (వ'హీ) ద్వారా అవతరింపజేశాము.[3] దానితో నీవు ఉమ్ముల్ ఖురా (మక్కా)[4] మరియు దాని చుట్టుప్రక్కల వారిని హెచ్చరించటానికి మరియు దానిని గురించి ఎలాంటి సందేహంలేని ఆ సమావేశదినాన్ని గురించి హెచ్చరించేందుకు కూడా.[5] (ఆ రోజు) ఒక వర్గం వారు స్వర్గానికి పోతారు, మరొకవర్గం వారు మండే నరకాగ్నిలోకి పోతారు.

---

2. నీ బాధ్యత కేవలం మా సందేశాన్ని వారికి అందజేయటమే!
3. చూడండి,14:4,13:37,19:97 ప్రతిప్రవక్త('అ.స.) తనకాలపు ప్రజలభాషనే మాట్లాడే వాడు.
4. ఉమ్ముల్ఖురా: అంటే అన్ని నగరాల తల్లి. మక్కా యొక్క మరొక పేరు. ఇది అతి ప్రాచీన నగరం. చూడండి, 6:92.
5. పునరుత్థానదినం: సమావేశదినం ఎందుకు అనబడిందంటే, ఆ రోజు అన్ని తరాలకు చెందిన మానవులు, మంచివారు, చెడ్డవారు, విశ్వాసులు, అవిశ్వాసులు అందరూ సమావేశపరచ బడతారు.

8. మరియు ఒకవేళ అల్లాహ్ కోరితే వారందరినీ ఒకే సమాజంగా చేసిఉండే వాడు![6] కాని ఆయన తానుకోరిన వారిని తన కరుణకు పాత్రులుగా చేసుకుంటాడు.[7] మరియు దుర్మార్గుల కొరకు, రక్షించేవాడు గానీ సహాయపడేవాడు గానీ ఎవ్వడూ ఉండడు.

وَلَوْ شَآءَ ٱللَّهُ لَجَعَلَهُمْ أُمَّةً وَٰحِدَةً وَلَٰكِن يُدْخِلُ مَن يَشَآءُ فِى رَحْمَتِهِۦ ۚ وَٱلظَّٰلِمُونَ مَا لَهُم مِّن وَلِىٍّ وَلَا نَصِيرٍ ﴿٨﴾

9. లేక, వారు ఆయనను వదలి ఇతరులను సంరక్షకులుగా చేసుకున్నారా? కానీ అల్లాహ్! కేవలం ఆయనే సంరక్షకుడు మరియు ఆయనే మృతులను బ్రతికించే వాడు మరియు ఆయనే ప్రతిదీ చేయగల సమర్థుడు.

أَمِ ٱتَّخَذُوا۟ مِن دُونِهِۦٓ أَوْلِيَآءَ ۖ فَٱللَّهُ هُوَ ٱلْوَلِىُّ وَهُوَ يُحْىِ ٱلْمَوْتَىٰ وَهُوَ عَلَىٰ كُلِّ شَىْءٍ قَدِيرٌ ﴿٩﴾

10. మరియు మీరు ఏ విషయాన్ని గురించి భేదాభిప్రాయాలు కలిగివున్నారో, దాని తీర్పు అల్లాహ్ వద్దనే ఉంది.[8] ఆయనే అల్లాహ్! నా ప్రభువు, నేను ఆయననే నమ్ముకున్నాను మరియు నేను పశ్చాత్తాపంతో ఆయన వైపునకే మరలుతాను.

وَمَا ٱخْتَلَفْتُمْ فِيهِ مِن شَىْءٍ فَحُكْمُهُۥٓ إِلَى ٱللَّهِ ۚ ذَٰلِكُمُ ٱللَّهُ رَبِّى عَلَيْهِ تَوَكَّلْتُ وَإِلَيْهِ أُنِيبُ ﴿١٠﴾

11. ఆయనే ఆకాశాలు మరియు భూమి యొక్క సృష్టికి మూలాధారి. ఆయన మీలోనుండే మీకొరకు జంటల్ని మరియు పశువులలో కూడా జంటల్ని చేశాడు.[9] ఈ విధంగా, ఆయన మిమ్మల్ని వ్యాపింప జేస్తున్నాడు. ఆయనకు పోలింది ఏదీ లేదు.[10] మరియు ఆయన సర్వం వినేవాడు, సర్వం చూసేవాడు.

فَاطِرُ ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضِ ۚ جَعَلَ لَكُم مِّنْ أَنفُسِكُمْ أَزْوَٰجًا وَمِنَ ٱلْأَنْعَٰمِ أَزْوَٰجًا ۖ يَذْرَؤُكُمْ فِيهِ ۚ لَيْسَ كَمِثْلِهِۦ شَىْءٌ ۖ وَهُوَ ٱلسَّمِيعُ ٱلْبَصِيرُ ﴿١١﴾

---

6. చూడండి, 5:48, 16:93, 10:19.
7.- చూడండి, 14:4 మరియు 22:16.
8. చూడండి, 5:101.
9. చూడండి, 16:72.
10. ఆయన (సు.తా.)తో పోల్చదగినది విశ్వంలో ఏదీ లేదు. చూడండి, 6:100,112:4.

لَهٗ مَقَالِيْدُ السَّمٰوٰتِ وَالْاَرْضِۚ يَبْسُطُ الرِّزْقَ
لِمَنْ يَّشَآءُ وَيَقْدِرُؕ اِنَّهٗ بِكُلِّ شَيْءٍ عَلِيْمٌ ﴿١٢﴾

12. ఆకాశాల యొక్క మరియు భూమి యొక్క తాళపుచెవులు ఆయనవద్దనే వున్నాయి. ఆయన తాను కోరినవానికి జీవనోపాధిని పుష్కలంగా ప్రసాదిస్తాడు మరియు (తానుకోరినవానికి) దానిని మితంగా ఇస్తాడు. నిశ్చయంగా, ఆయనకు ప్రతిదానిని గురించి బాగాతెలుసు. **(1/8)**

شَرَعَ لَكُمْ مِّنَ الدِّيْنِ مَا وَصّٰى بِهٖ نُوْحًا وَّالَّذِيْۤ
اَوْحَيْنَاۤ اِلَيْكَ وَمَا وَصَّيْنَا بِهٖۤ اِبْرٰهِيْمَ وَمُوْسٰى
وَعِيْسٰۤى اَنْ اَقِيْمُوا الدِّيْنَ وَلَا تَتَفَرَّقُوْا فِيْهِؕ
كَبُرَ عَلَى الْمُشْرِكِيْنَ مَا تَدْعُوْهُمْ اِلَيْهِؕ اَللّٰهُ يَجْتَبِيْۤ
اِلَيْهِ مَنْ يَّشَآءُ وَيَهْدِيْۤ اِلَيْهِ مَنْ يُّنِيْبُ ﴿١٣﴾

13. * ఆయన, నూ'హ్‌కు విధించిన (ఇస్లాం) ధర్మాన్నే, మీ కొరకు శాసించాడు; మరియు దానినే (ఓ ము'హమ్మద్!) మేము నీకు దివ్యజ్ఞానం (వ'హీ) ద్వారా అవతరింప జేశాము; మరియు మేము దానినే ఇబ్రాహీమ్, మూసా మరియు 'ఈసాలకు కూడా విధిగా జేశాము; ఈ ధర్మాన్నే స్థాపించాలని.[11] మరియు దానిని గురించి భేదాభిప్రాయాలకు గురికాకుండా ఉండాలని. నీవు దాని వైపునకు పిలిచేది బహుదైవారాధకులకు ఎంతో సహింపలేనిదిగా ఉంది. అల్లాహ్ తాను కోరిన వానిని తన వైపునకు ఆకర్షిస్తాడు మరియు పశ్చాత్తాపంతో తనవైపునకు మరలేవానికి మార్గదర్శకత్వం చేస్తాడు.[12]

---

11. అద్దీను: ధర్మం అంటే అల్లాహ్(సు.తా.)ను విశ్వసించి ఆయన అద్వితీయాన్ని నమ్మి, ఆయన ప్రవక్తలను అనుసరించి, ఆయన షరీయత్‌పై నడవటం. ప్రవక్తలందరి ధర్మం ఇదే! చూడండి, **2:213**. కాని వారి షరీయత్‌లలో కొన్ని భేదాలుండవచ్చు. (చూడండి, **5:48**) అందుకే దైవప్రవక్త (స'అస) అన్నారు: 'మేము (ప్రవక్తలం) అంతా సోదరులం. మా అందరి ధర్మం ఒక్కటే ఇస్లాం!' (స'హీ'హ్ బు'ఖారీ).

12. అల్లాహ్ (సు.తా.), అతనికే మార్గదర్శకత్వం చేస్తాడు, ఎవడైతే స్వయంగా, అల్లాహ్ (సు.తా.) వైపునకు మరలుతాడో! ఇక ఎవడైతే మార్గభ్రష్టత్వాన్ని ఎన్నుకుంటాడో, ఆయన, అతనిని దానిలో వదలుతాడు. అల్లాహ్ (సు.తా.) దృష్టిలో, ఆయనకు విధేయత (ఇస్లాం) మాత్రమే నిజమైన ధర్మం. చూడండి, **3:19, 3:85, 21:92** మరియు **23:52**.

وَمَا تَفَرَّقُوٓا۟ إِلَّا مِنۢ بَعْدِ مَا جَآءَهُمُ ٱلْعِلْمُ بَغْيًۢا بَيْنَهُمْ ۚ وَلَوْلَا كَلِمَةٌ سَبَقَتْ مِن رَّبِّكَ إِلَىٰٓ أَجَلٍ مُّسَمًّى لَّقُضِىَ بَيْنَهُمْ ۚ وَإِنَّ ٱلَّذِينَ أُورِثُوا۟ ٱلْكِتَـٰبَ مِنۢ بَعْدِهِمْ لَفِى شَكٍّ مِّنْهُ مُرِيبٍ ﴿١٤﴾

14. మరియు వారి వద్దకు (సత్య) జ్ఞానం వచ్చిన తరువాతనే - వారి పరస్పర ద్వేషంవల్ల - వారి మధ్య భేదాభిప్రాయాలు వచ్చాయి. మరియు ఒక నిర్ణీతకాలపు వాగ్దానం నీ ప్రభువు తరఫునుండి చేయబడి ఉండకపోతే, వారి మధ్య తీర్పు ఎప్పుడో జరిగిఉండేది.[13] మరియు నిశ్చయంగా, వారి తర్వాత గ్రంథాన్ని వారసత్వంలో పొందిన వారు దానిని (ఇస్లాంను) గురించి గొప్ప సంశయంలో పడిఉన్నారు.

فَلِذَٰلِكَ فَٱدْعُ ۖ وَٱسْتَقِمْ كَمَآ أُمِرْتَ ۖ وَلَا تَتَّبِعْ أَهْوَآءَهُمْ ۖ وَقُلْ ءَامَنتُ بِمَآ أَنزَلَ ٱللَّهُ مِن كِتَـٰبٍ ۖ وَأُمِرْتُ لِأَعْدِلَ بَيْنَكُمُ ۖ ٱللَّهُ رَبُّنَا وَرَبُّكُمْ ۖ لَنَآ أَعْمَـٰلُنَا وَلَكُمْ أَعْمَـٰلُكُمْ ۖ لَا حُجَّةَ بَيْنَنَا وَبَيْنَكُمُ ۖ ٱللَّهُ يَجْمَعُ بَيْنَنَا ۖ وَإِلَيْهِ ٱلْمَصِيرُ ﴿١٥﴾

15. కావున నీవు (ఓ ము'హమ్మద్!) దీని (ఈ సత్యధర్మం) వైపునకే వారిని పిలువు. మరియు నీకు ఆజ్ఞాపించబడిన విధంగా దానిపై స్థిరంగా ఉండు. మరియు వారి కోరికలను అనుసరించకు. మరియు వారితో ఇలా అను: "అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్నే నేను విశ్వసించాను. మరియు మీ మధ్య న్యాయం చేయమని నేను ఆజ్ఞాపించబడ్డాను. అల్లాహ్‌యే మా ప్రభువు! మరియు మీ ప్రభువు కూడాను, మా కర్మలు మాకూ మరియు మీ కర్మలు మీకూ. మా మధ్య మరియు మీ మధ్య ఎలాంటి వివాదం ఉండనవసరం లేదు. అల్లాహ్ మనందరినీ సమావేశపరుస్తాడు. మరియు ఆయనవైపే (మనందరి) గమ్యస్థానముంది."

وَٱلَّذِينَ يُحَآجُّونَ فِى ٱللَّهِ مِنۢ بَعْدِ مَا ٱسْتُجِيبَ لَهُۥ حُجَّتُهُمْ دَاحِضَةٌ عِندَ رَبِّهِمْ وَعَلَيْهِمْ غَضَبٌ وَلَهُمْ عَذَابٌ شَدِيدٌ ﴿١٦﴾

16. మరియు అల్లాహ్ సందేశం స్వీకరించిన తర్వాత, (స్వీకరించినవారితో) ఆయనను గురించి ఎవరు వాదిస్తారో, వారి వాదం వారి ప్రభువు సన్నిధిలో నిరర్థకమైనది; మరియు వారిపై ఆయన (అల్లాహ్) ఆగ్రహం విరుచుకుపడుతుంది మరియు వారికి కఠిన శిక్ష పడుతుంది.

---

13. చూడండి, 10:19.

اَللّٰهُ الَّذِیْۤ اَنْزَلَ الْكِتٰبَ بِالْحَقِّ وَالْمِیْزَانَ ؕ وَمَا یُدْرِیْكَ لَعَلَّ السَّاعَةَ قَرِیْبٌ ۟

17. అల్లాహ్‌యే సత్యంతో గ్రంథాన్ని[14] మరియు (న్యాయానికి) త్రాసును[15] అవతరింపజేశాడు. మరి నీవు ఏవిధంగా గ్రహించగలవు. బహుశా తీర్పుగడియ సమీపంలోనే ఉండవచ్చు!

یَسْتَعْجِلُ بِهَا الَّذِیْنَ لَا یُؤْمِنُوْنَ بِهَا ۚ وَالَّذِیْنَ اٰمَنُوْا مُشْفِقُوْنَ مِنْهَا ۙ وَیَعْلَمُوْنَ اَنَّهَا الْحَقُّ ؕ اَلَاۤ اِنَّ الَّذِیْنَ یُمَارُوْنَ فِی السَّاعَةِ لَفِیْ ضَلٰلٍۭ بَعِیْدٍ ۟

18. దానిని నమ్మనివారే దానికొరకు తొందరపెడతారు. మరియు విశ్వసించిన వారు, దానిని గురించి భయపడతారు మరియు అది రావటం నిశ్చయంగా, సత్యమేనని తెలుసుకుంటారు. వినండి! నిశ్చయంగా ఎవరైతే తీర్పు ఘడియను గురించి వాదులాడుతారో, వారు మార్గ భ్రష్టత్వంలో చాలాదూరం పోయినవారే!

اَللّٰهُ لَطِیْفٌۢ بِعِبَادِهٖ یَرْزُقُ مَنْ یَّشَآءُ ۚ وَهُوَ الْقَوِیُّ الْعَزِیْزُ ۟

19. అల్లాహ్ తన దాసులపట్ల ఎంతో మృదుహృదయుడు; ఆయన తాను కోరిన వారికి జీవనోపాధిని ప్రసాదిస్తాడు. మరియు ఆయన మహా బలవంతుడు, సర్వశక్తి సంపన్నుడు.

مَنْ كَانَ یُرِیْدُ حَرْثَ الْاٰخِرَةِ نَزِدْ لَهٗ فِیْ حَرْثِهٖ ۚ وَمَنْ كَانَ یُرِیْدُ حَرْثَ الدُّنْیَا نُؤْتِهٖ مِنْهَا ۙ وَمَا لَهٗ فِی الْاٰخِرَةِ مِنْ نَّصِیْبٍ ۟

20. ఎవడు పరలోకఫలాన్ని కోరుకుంటాడో, మేము అతనికి అతని ఫలంలో వృద్ధి కలిగిస్తాము.[16] మరియు ఎవడైతే ఇహలోక ఫలాన్ని కోరుకుంటాడో, మేము అతనికి దాని నొసంగుతాము మరియు అతనికి పరలోక (ప్రతిఫలంలో) ఎలాంటి భాగముండదు.[17]

---

14. గ్రంథం అంటే ఇక్కడ అన్నీ దివ్యగ్రంథాలు.

15. త్రాసు ఎందుకు పేర్కొనబడిందంటే, న్యాయంగా తూచటానికి త్రాసు మాత్రమే ఉపయోగ పడుతుంది. దీనికై చూడండి, **57:25** మరియు **55:7-9**.

16. పుణ్యఫలితంలో ఈ అధికం, అల్లాహ్ (సు.తా.) కోరితే పదిరెట్లు లేక ఏడు వందల రెట్లు లేక ఇంకా ఎక్కువ రెట్లు కావచ్చు.

17. ఇటువంటి ఆయత్‌కు చూడండి, **17:18**.

21. ఏమీ? అల్లాహ్ అనుమతించని ధర్మాన్ని వారికొరకు విధించగల, ఆయన భాగస్వాములు ఎవరైనా వారిదగ్గర ఉన్నారా? ఒకవేళ తీర్పుదినపు వాగ్దానం ముందే చేయబడి ఉండకపోతే, వారి మధ్య తీర్పు ఎప్పుడో జరిగివుండేదే. మరియు నిశ్చయంగా, ఈ దుర్మార్గులకు బాధాకరమైన శిక్ష పడుతుంది.

أَمْ لَهُمْ شُرَكَٰٓؤُا۟ شَرَعُوا۟ لَهُم مِّنَ ٱلدِّينِ مَا لَمْ يَأْذَنۢ بِهِ ٱللَّهُ ۚ وَلَوْلَا كَلِمَةُ ٱلْفَصْلِ لَقُضِىَ بَيْنَهُمْ ۗ وَإِنَّ ٱلظَّٰلِمِينَ لَهُمْ عَذَابٌ أَلِيمٌ ﴿٢١﴾

22. ఈ దుర్మార్గులు (పునరుత్థానదినాన) తాము చేసిన కర్మల ఫలితాన్ని చూసి భయపడటాన్ని, నీవు చూస్తావు మరియు అది వారిపై తప్పక పడుతుంది. మరియు ఎవరైతే విశ్వసించి, సత్కార్యాలు చేస్తారో, వారు స్వర్గపు పచ్చిక మైదానాలలో ఉంటారు. వారికి తాము కోరేదంతా తమ ప్రభువు తరఫునుండి లభిస్తుంది. అదే ఆ గొప్ప అనుగ్రహం.

تَرَى ٱلظَّٰلِمِينَ مُشْفِقِينَ مِمَّا كَسَبُوا۟ وَهُوَ وَاقِعٌۢ بِهِمْ ۗ وَٱلَّذِينَ ءَامَنُوا۟ وَعَمِلُوا۟ ٱلصَّٰلِحَٰتِ فِى رَوْضَاتِ ٱلْجَنَّاتِ ۖ لَهُم مَّا يَشَآءُونَ عِندَ رَبِّهِمْ ۚ ذَٰلِكَ هُوَ ٱلْفَضْلُ ٱلْكَبِيرُ ﴿٢٢﴾

23. ఆ (స్వర్గపు) శుభవార్తనే, అల్లాహ్ విశ్వసించి సత్కార్యాలు చేసే తన దాసులకు తెలియజేస్తున్నాడు. (ఓ ప్రవక్తా!) వారితో ఇలా అను: ''నేను దీనికి బదులుగా మీ నుండి బంధుత్వప్రేమ తప్ప వేరే ప్రతిఫలాన్ని కోరడం లేదు!''[18] మరియు ఎవడు మంచిని

ذَٰلِكَ ٱلَّذِى يُبَشِّرُ ٱللَّهُ عِبَادَهُ ٱلَّذِينَ ءَامَنُوا۟ وَعَمِلُوا۟ ٱلصَّٰلِحَٰتِ ۗ قُل لَّآ أَسْـَٔلُكُمْ عَلَيْهِ أَجْرًا إِلَّا ٱلْمَوَدَّةَ فِى ٱلْقُرْبَىٰ ۗ وَمَن يَقْتَرِفْ حَسَنَةً نَّزِدْ لَهُۥ فِيهَا حُسْنًا ۚ إِنَّ ٱللَّهَ غَفُورٌ شَكُورٌ ﴿٢٣﴾

---

18. మక్కా ముష్రిక్ ఖురైషులు చాలామంది దైవప్రవక్త ('స'అస) దగ్గరి సంబంధీకులే. ఇక్కడ వారితో: 'స్నేహ, ప్రేమభావాలు చూపకున్నా తాను, అల్లాహ్ (సు.తా.) ధర్మం ఇస్లాంను ప్రచారం చేస్తున్నందుకు కనీసం శత్రుత్వమైనా వహించకండి.' అని చెప్పమని అల్లాహ్ (సు.తా.) దైవప్రవక్త('స'అస)ను ఆదేశిస్తున్నాడు.

మరొక ముఖ్య విషయం ఇక్కడ షియా తెగవారు భిన్నంగా అర్థంచేసుకొని దానిని ప్రచారం చేస్తున్నది: ఇక్కడ బంధుత్వ ప్రేమను వారు, 'అలీ, ఫాతిమా, 'హసన్ మరియు 'హుసైన్ ర'ది.'అన్హుమ్‌లతో మాత్రమే, ప్రేమతో వ్యవహరించడం, అని అర్థం తీశారు. ఈ సూరహ్ మక్కాలో అవతరింపజేయబడింది. అప్పుడు 'అలీ మరియు ఫాతిమా (ర'ది.'అన్హుమ్)ల, వివాహం కూడా కాలేదు. మరొక విషయమేమిటంటే దైవప్రవక్త ('స'అస)కు నలుగురు కుమార్తెలు, 'జైనబ్, రుఖయ్యా, ఉమ్మె కుల్సూ'మ్, ఫాతిమ మరియు ముగ్గురు కుమారులు, ఖాసిమ్, 'అబ్దుల్లాహ్ మరియు ఇబ్రాహీమ్ (రజి.అన్హుమ్). కుమారులందరూ చిన్న వయస్సులలోనే చనిపోయారు. కాని ఇతర ముగ్గురు కుమార్తెలు (ర'ది.'అన్హుమ్) భర్తా, పిల్లలు గలవారు. వారు కూడా దైవప్రవక్త ('స'అస) యొక్క దగ్గరి సంబంధీకు(ఖురబా)లలోని

సంపాదించుకుంటాడో, అతనికి దానిలో మేము మరింత మంచిని పెంచుతాము. నిశ్చయంగా, అల్లాహ్ క్షమాశీలుడు, కృతజ్ఞతలను ఆమోదించేవాడు.

24. ఏమీ? వారు: "అతను (ము'హమ్మద్!) అల్లాహ్ పేరుతో అసత్యాలు కల్పిస్తున్నాడు." అని అంటున్నారా? కాని ఒకవేళ అల్లాహ్ తలచుకుంటే, నీ హృదయం మీద ముద్రవేసేవాడు. మరియు అల్లాహ్ అసత్యాన్ని రూపుమాపి, తన ఆజ్ఞతో సత్యాన్ని స్థాపిస్తాడు.[19] నిశ్చయంగా ఆయనకు హృదయాలలో ఉన్నదంతా బాగా తెలుసు.

أَمْ يَقُولُونَ افْتَرَىٰ عَلَى اللَّهِ كَذِبًا ۖ فَإِن يَشَإِ اللَّهُ يَخْتِمْ عَلَىٰ قَلْبِكَ ۗ وَيَمْحُ اللَّهُ الْبَاطِلَ وَيُحِقُّ الْحَقَّ بِكَلِمَاتِهِ ۚ إِنَّهُ عَلِيمٌ بِذَاتِ الصُّدُورِ ﴿٢٤﴾

25. ఆయనే తన దాసుల పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు. మరియు పాపాలను మన్నించేవాడు. మరియు మీరు చేసేదంతా ఆయనకు బాగా తెలుసు.

وَهُوَ الَّذِي يَقْبَلُ التَّوْبَةَ عَنْ عِبَادِهِ وَيَعْفُو عَنِ السَّيِّئَاتِ وَيَعْلَمُ مَا تَفْعَلُونَ ﴿٢٥﴾

26. మరియు ఆయన విశ్వసించి, సత్కార్యాలు చేసేవారి ప్రార్థనలను అంగీకరిస్తాడు మరియు వారిపై తన అనుగ్రహాన్ని మరింత అధికంచేస్తాడు. ఇక సత్యతిరస్కారులు! వారికి కఠిన శిక్ష పడుతుంది. (**1/4**)

وَيَسْتَجِيبُ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ وَيَزِيدُهُم مِّن فَضْلِهِ ۚ وَالْكَافِرُونَ لَهُمْ عَذَابٌ شَدِيدٌ ﴿٢٦﴾

27. * మరియు ఒకవేళ అల్లాహ్ తన దాసులందరికీ పుష్కలంగా జీవనోపాధిని ప్రసాదించి ఉంటే, వారు భూమిలో తిరుగుబాటుకు పాల్పడేవారు. కావున ఆయన తన ఇష్టప్రకారం, మితంగా ఇస్తాడు. నిశ్చయంగా ఆయన తన దాసులను గురించి బాగా ఎరుగును, ఆయన అంతా చూస్తున్నాడు!

وَلَوْ بَسَطَ اللَّهُ الرِّزْقَ لِعِبَادِهِ لَبَغَوْا فِي الْأَرْضِ وَلَٰكِن يُنَزِّلُ بِقَدَرٍ مَّا يَشَاءُ ۚ إِنَّهُ بِعِبَادِهِ خَبِيرٌ بَصِيرٌ ﴿٢٧﴾

వారే కదా! వారిలో ఇద్దరు మూడవ 'ఖలీఫా 'ఉస్మాన్ (ర'ది.'అ.) భార్యలు కూడాను. కాని ఈ షియా తెగవారు, వారిని దైవప్రవక్త ('స'అస) దగ్గరి సంబంధీకులలో పరిగణించకపోవడం అతిశయం కాదా!

19. చూడండి, 10:82.

وَهُوَ الَّذِي يُنَزِّلُ الْغَيْثَ مِنْ بَعْدِ مَا قَنَطُوا وَيَنْشُرُ رَحْمَتَهُ ۚ وَهُوَ الْوَلِيُّ الْحَمِيدُ ﴿٢٨﴾

28. మరియు ఆయనే, వారు నిరాశకులోనై ఉన్నప్పుడు వర్షాన్ని కురిపిస్తాడు మరియు తన కారుణ్యాన్ని వ్యాపింపజేస్తాడు. మరియు ఆయనే సంరక్షకుడు, ప్రశంసనీయుడు.

وَمِنْ آيَاتِهِ خَلْقُ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَمَا بَثَّ فِيهِمَا مِنْ دَابَّةٍ ۚ وَهُوَ عَلَىٰ جَمْعِهِمْ إِذَا يَشَاءُ قَدِيرٌ ﴿٢٩﴾

29. మరియు ఆయన సూచనలలో (ఆయాత్‌లలో), ఆకాశాలను మరియు భూమిని మరియు వాటిలో వ్యాపింపజేసిన జీవరాసులను సృష్టించటం కూడా ఉంది. మరియు ఆయన తాను కోరినప్పుడు వాటి నన్నింటినీ సమీకరించగల సమర్థుడు.

وَمَا أَصَابَكُمْ مِنْ مُصِيبَةٍ فَبِمَا كَسَبَتْ أَيْدِيكُمْ وَيَعْفُو عَنْ كَثِيرٍ ﴿٣٠﴾

30. మీ పై ఏ ఆపద వచ్చినా, అది మీ చేతులారా మీరు సంపాదించుకున్నదే! మరియు ఆయన (మీ తప్పులను) ఎన్నింటినో క్షమిస్తాడు.[20]

وَمَا أَنْتُمْ بِمُعْجِزِينَ فِي الْأَرْضِ ۖ وَمَا لَكُمْ مِنْ دُونِ اللَّهِ مِنْ وَلِيٍّ وَلَا نَصِيرٍ ﴿٣١﴾

31. మరియు మీరు భూమిలో ఆయన నుంచి తప్పించుకోలేరు. మరియు మీకు అల్లాహ్ తప్ప మరొక సంరక్షకుడు గానీ, సహాయకుడు గానీ లేడు!

وَمِنْ آيَاتِهِ الْجَوَارِ فِي الْبَحْرِ كَالْأَعْلَامِ ﴿٣٢﴾

32. మరియు ఆయన సూచనలలో (ఆయాత్‌లలో) సముద్రంలో, కొండల మాదిరిగా పయనించే ఓడలు కూడా వున్నాయి.

إِنْ يَشَأْ يُسْكِنِ الرِّيحَ فَيَظْلَلْنَ رَوَاكِدَ عَلَىٰ ظَهْرِهِ ۚ إِنَّ فِي ذَٰلِكَ لَآيَاتٍ لِكُلِّ صَبَّارٍ شَكُورٍ ﴿٣٣﴾

33. ఒకవేళ ఆయన కోరితే గాలిని ఆపగలడు అప్పుడవి దాని (సముద్రపు) వీపు మీద నిలిచిపోతాయి. నిశ్చయంగా, ఇందులో సహనం గలవానికి, కృతజ్ఞునికి ఎన్నో సూచనలున్నాయి.

---

20. చూడండి, **51:52-53**. వ్యాఖ్యాతలు దీనిని రెండు విధాలుగా అర్థం చేసుకున్నారు.
ఒకటి: పూర్వప్రజలు తమ ప్రవక్త ('అలైహిమ్ స.)లతో ఇతను పిచ్చివాడు, మాంత్రికుడు, అసత్యవాదుడు, వగైరా అన్న మాటలనే ఈ మక్కా ముష్రికులు కూడా నీతో అంటున్నారు. ఈ విధంగా దైవప్రవక్త ('స'అస) ఓదార్చబడుతున్నారు.
రెండో అర్థం: దైవప్రవక్త ('స'అస)తో ఏకాగ్రచిత్తం, ఏక దైవారాధన, (ఇస్లాం) గురించి చెప్పబడిన మాటలు, ఇంతకు ముందు ప్రవక్తలందరితో చెప్పబడిన మాటలే! (ఫ'త్హ్ అల్-ఖదీర్).

أَوْ يُوبِقْهُنَّ بِمَا كَسَبُوا وَيَعْفُ عَن كَثِيرٍ ﴿٣٤﴾

34. లేదా ఆయన వారి కర్మల ఫలితంగా వారిని (ముంచి) నాశనం చేయవచ్చు, కాని ఆయన ఎన్నింటినో క్షమిస్తాడు కూడాను.

وَيَعْلَمَ الَّذِينَ يُجَادِلُونَ فِي آيَاتِنَا مَا لَهُم مِّن
مَّحِيصٍ ﴿٣٥﴾

35. మరియు మా సూచనలను (ఆయాత్‌లను) గురించి వాదులాడే వారు, తమకు తప్పించుకునే చోటు లేదని తెలుసుకుంటారు.[21]

فَمَا أُوتِيتُم مِّن شَيْءٍ فَمَتَاعُ الْحَيَاةِ الدُّنْيَا ۖ
وَمَا عِندَ اللَّهِ خَيْرٌ وَأَبْقَىٰ لِلَّذِينَ آمَنُوا وَعَلَىٰ
رَبِّهِمْ يَتَوَكَّلُونَ ﴿٣٦﴾

36. కావున మీకు ఇవ్వబడిందంతా ప్రాపంచిక జీవితపు సుఖసంతోషమే. కనుక అల్లాహ్ వద్దనున్నదే - విశ్వసించి తమ ప్రభువునే నమ్ముకున్న వారికొరకు - ఉత్తమ మైనదీ మరియు శాశ్వతమైనదీను.[22]

وَالَّذِينَ يَجْتَنِبُونَ كَبَائِرَ الْإِثْمِ وَالْفَوَاحِشَ
وَإِذَا مَا غَضِبُوا هُمْ يَغْفِرُونَ ﴿٣٧﴾

37. మరియు అలాంటివారు పెద్దపాపాలు మరియు అశ్లీలమైనపనులకు దూరంగా ఉంటారు మరియు కోపం వచ్చినా క్షమిస్తారు;[23]

وَالَّذِينَ اسْتَجَابُوا لِرَبِّهِمْ وَأَقَامُوا الصَّلَاةَ
وَأَمْرُهُمْ شُورَىٰ بَيْنَهُمْ وَمِمَّا رَزَقْنَاهُمْ يُنفِقُونَ ﴿٣٨﴾

38. మరియు అలాంటి వారు తమ ప్రభువు ఆజ్ఞాపాలన చేస్తారు మరియు నమా'జ్‌ను స్థాపిస్తారు[24] మరియు తమ వ్యవహారాలను పరస్పర సంప్రదింపుల ద్వారా పరిష్కరించు కుంటారు[25] మరియు మేము వారికి ప్రసాదించిన జీవనోపాధి నుండి ఇతరుల మీద ఖర్చుచేస్తారు;

---

21. చూడండి, **40:35**.

22. కావున ఇహలోక జీవిత సుఖసంతోషాలకు ఎక్కువ ప్రాధాన్యత నివ్వకుండా, విశ్వసించి సత్కార్యాలు చేయటంలో పోటీపడండి.

23. దైవప్రవక్త ('స'అస) తన స్వంతానికి జరిగిన కష్ట నష్టాలకూ, హానికీ ఎన్నడూ ప్రతీకారం తీసుకోలేదు. కాని అల్లహ్ (సు.తా.) యొక్క హద్దులను అతిక్రమించటం అతనికి సహించరాని విషయం, (బు'ఖారీ, ముస్లిం).

24. నమా'జ్‌ను సరిగ్గా, దాని సమయంలో చేయటం విశ్వాసానికి ప్రధాన ఆనవాలు.

25. 'స'హాబా (ర'ది.'అన్హుమ్)లు తమ విషయాలలో పరస్పరం సంప్రదింపులు, సలహాలు చేసుకునేవారు. దైవప్రవక్త ('స'అస) కూడా ముఖ్యమైన విషయాలలో, యుద్ధ సన్నాహాలలో తమ అనుచరు(ర'ది.'అన్హుమ్)లతో సంప్రదింపులు చేసేవారు. ఒక పాలకుడు కూడా తనకు సలహాలివ్వటానికి నిపుణులను నియమించుకోవడం ఎంతో ముఖ్యం. చూడండి, **3:159**.

39. మరియు అలాంటి వారు తమపై దౌర్జన్యం జరిగినపుడు దానికి న్యాయ ప్రతీకారం మాత్రమే చేస్తారు.[26]

وَالَّذِيْنَ اِذَآ اَصَابَهُمُ الْبَغْيُ هُمْ يَنْتَصِرُوْنَ ﴿٣٩﴾

40. మరియు కీడుకు ప్రతీకారం దానంతటి కీడు మాత్రమే. కాని ఎవడైనా క్షమించి సంధి చేసుకుంటే అతని ప్రతిఫలం అల్లాహ్ దగ్గర ఉంది. నిశ్చయంగా ఆయన దుర్మార్గులంటే ఇష్టపడడు.[27]

وَجَزٰٓؤُا سَيِّئَةٍ سَيِّئَةٌ مِّثْلُهَا ۚ فَمَنْ عَفَا وَاَصْلَحَ فَاَجْرُهٗ عَلَى اللّٰهِ ؕ اِنَّهٗ لَا يُحِبُّ الظّٰلِمِيْنَ ﴿٤٠﴾

41. కాని ఎవరైనా తమకు అన్యాయం జరిగినప్పుడు దానికి తగినంత న్యాయ ప్రతీకారం మాత్రమే తీసుకుంటే అలాంటి వారు నిందార్హులు కారు.

وَلَمَنِ انْتَصَرَ بَعْدَ ظُلْمِهٖ فَاُولٰٓئِكَ مَا عَلَيْهِمْ مِّنْ سَبِيْلٍ ﴿٤١﴾

42. కాని, వాస్తవానికి ఎవరైతే ప్రజలపై దౌర్జన్యాలుచేస్తారో మరియు భూమిలో అన్యాయంగా ఉపద్రవాలు రేకెత్తిస్తారో అలాంటి వారు నిందార్హులు. అలాంటి వారు, వారికే! బాధాకరమైన శిక్ష గలదు.

اِنَّمَا السَّبِيْلُ عَلَى الَّذِيْنَ يَظْلِمُوْنَ النَّاسَ وَيَبْغُوْنَ فِى الْاَرْضِ بِغَيْرِ الْحَقِّ ؕ اُولٰٓئِكَ لَهُمْ عَذَابٌ اَلِيْمٌ ﴿٤٢﴾

43. మరియు ఎవడైతే సహనం వహించి క్షమిస్తాడో! నిశ్చయంగా, అది (అల్లాహ్ దృష్టిలో) ఎంతో సహృదయంతో(సాహసంతో) కూడినపని![28]

وَلَمَنْ صَبَرَ وَغَفَرَ اِنَّ ذٰلِكَ لَمِنْ عَزْمِ الْاُمُوْرِ ﴿٤٣﴾

44. మరియు, ఎవడినైతే అల్లాహ్ మార్గ భ్రష్టత్వంలో పడనిస్తాడో! దాని తరువాత వాడికి సంరక్షకుడు, ఎవ్వడూ ఉండడు.[29] మరియు ఈదుర్మార్గులు శిక్షను చూసినపుడు: "మేము తిరిగి (భూలోకంలోకి) పోయే మార్గమేదైనా

وَمَنْ يُّضْلِلِ اللّٰهُ فَمَا لَهٗ مِنْ وَّلِيٍّ مِّنْۢ بَعْدِهٖ ؕ وَتَرَى الظّٰلِمِيْنَ لَمَّا رَاَوُا الْعَذَابَ يَقُوْلُوْنَ هَلْ اِلٰى مَرَدٍّ مِّنْ سَبِيْلٍ ﴿٤٤﴾

---

26. దైవప్రవక్త ('స'అస) ఎన్నడూ, తనకు హాని చేసిన వారితో కూడా ప్రతీకారం తీర్చుకోలేదు. ఉదాహరణకు అతనికి ఆహారంలో విషమిచ్చిన యూదు స్త్రీతో మరియు అతనిపై మంత్రజాలం (చేతబడి) చేసిన లుబైద్ బిన్ 'ఆసిమ్‌తో లేక అతనిని చంపగోరిన వారితో గాని ప్రతీకారం తీర్చుకోలేదు.
27. చూడండి, 2:190.
28. చూడండి, 41:34-35 మరియు 13:22.
29. చూడండి, 14:4 చివరి వాక్యం.

ఉందా?" అని అడగటం నీవు చూస్తావు.[30]

45. మరియు వారిని, దాని (నరకం) ముందుకు తీసుకొనివచ్చినప్పుడు, వారు అవమానంతో కృంగిపోతూ, దొంగచూపులతో దానిని చూడటం నీవు గమనిస్తావు. మరియు విశ్వసించిన వారు ఇలా అంటారు: "నిశ్చయంగా, తమను తాము మరియు తమ సంబంధీకులను (అనుచరులను) నష్టానికి గురిచేసుకున్నవారే, ఈ పునరుత్థాన దినమున నష్టపోయే వారు. జాగ్రత్త! నిశ్చయంగా, దుర్మార్గులే శాశ్వతమైన శిక్షకు గురిఅవుతారు."

وَتَرٰىهُمْ يُعْرَضُوْنَ عَلَيْهَا خٰشِعِيْنَ مِنَ الذُّلِّ
يَنْظُرُوْنَ مِنْ طَرْفٍ خَفِيٍّ ۗ وَقَالَ الَّذِيْنَ اٰمَنُوْٓا
اِنَّ الْخٰسِرِيْنَ الَّذِيْنَ خَسِرُوْٓا اَنْفُسَهُمْ وَاَهْلِيْهِمْ يَوْمَ
الْقِيٰمَةِ ۗ اَلَآ اِنَّ الظّٰلِمِيْنَ فِيْ عَذَابٍ مُّقِيْمٍ ﴿٤٥﴾

46. మరియు అల్లాహ్ తప్ప, ఇతరు లెవ్వరూ వారికి రక్షకులుగా గానీ, సహాయకులుగా గానీ ఉండరు. మరియు అల్లాహ్ మార్గభ్రష్టత్వంలో వదిలిన వారికి (దానినుండి బయటపడే) మార్గమేదీ వుండదు.

وَمَا كَانَ لَهُمْ مِّنْ اَوْلِيَآءَ يَنْصُرُوْنَهُمْ مِّنْ دُوْنِ اللّٰهِ ۗ
وَمَنْ يُّضْلِلِ اللّٰهُ فَمَا لَهٗ مِنْ سَبِيْلٍ ۗ ﴿٤٦﴾

47. (కావున ఓ మానవులారా మరియు జిన్నాతులారా!) మీరు, తొలగింపబడే అవకాశం లేనటువంటి ఆ దినం, అల్లాహ్ తరఫునుండి రాకముందే, మీ ప్రభువు ఆజ్ఞను శిరసా వహించండి. ఆరోజున మీకు ఎక్కడా ఆశ్రయం లభించదు. మరియు మీకు (మీ పాపాలను) నిరాకరించటానికికూడా వీలుండదు.[31]

اِسْتَجِيْبُوْا لِرَبِّكُمْ مِّنْ قَبْلِ اَنْ يَّاْتِيَ يَوْمٌ لَّا مَرَدَّ لَهٗ
مِنَ اللّٰهِ ۗ مَا لَكُمْ مِّنْ مَّلْجَاٍ يَّوْمَئِذٍ وَّمَا لَكُمْ مِّنْ نَّكِيْرٍ ﴿٤٧﴾

48. (ఓ ప్రవక్తా!) ఒకవేళ వారు విముఖులైతే మేము నిన్ను వారిపై రక్షకునిగా చేసి పంపలేదు. నీ పని కేవలం (సందేశాన్ని) అందజేయటం మాత్రమే.[32] మరియు మేము మానవునికి మా కారుణ్యాన్ని రుచిచూపిస్తే, దానికి అతడు

فَاِنْ اَعْرَضُوْا فَمَآ اَرْسَلْنٰكَ عَلَيْهِمْ حَفِيْظًا ۗ اِنْ عَلَيْكَ
اِلَّا الْبَلٰغُ ۗ وَاِنَّآ اِذَآ اَذَقْنَا الْاِنْسَانَ مِنَّا رَحْمَةً فَرِحَ
بِهَا ۚ وَاِنْ تُصِبْهُمْ سَيِّئَةٌۢ بِمَا قَدَّمَتْ اَيْدِيْهِمْ
فَاِنَّ الْاِنْسَانَ كَفُوْرٌ ﴿٤٨﴾

---

30. చూడండి, 6:27-28.
31. చూడండి, 75:10-12.
32. చూడండి, 2:272, 13:40 మరియు 88:21-22.

సంతోషంతో పొంగిపోతాడు. కాని ఒకవేళ వారికి తమ చేతులారా చేసుకున్నదానికి ఫలితంగా, కీడు కలిగినట్లయితే! నిశ్చయంగా, అప్పుడు మానవుడు కృతఘ్నుడవుతాడు!

لِلّٰهِ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ؕ یَخْلُقُ مَا یَشَآءُ ؕ یَهَبُ لِمَنْ یَّشَآءُ اِنَاثًا وَّیَهَبُ لِمَنْ یَّشَآءُ الذُّكُوْرَ ﴿۴۹﴾

49. భూమ్యాకాశాల సామ్రాజ్యాధికారం అల్లాహ్‌దే! ఆయన తానుకోరింది సృష్టిస్తాడు. ఆయన తానుకోరిన వారికి కుమార్తెలను ప్రసాదిస్తాడు మరియు తాను కోరినవారికి కుమారులను ప్రసాదిస్తాడు.

اَوْ یُزَوِّجُهُمْ ذُكْرَانًا وَّاِنَاثًا ۚ وَیَجْعَلُ مَنْ یَّشَآءُ عَقِیْمًا ؕ اِنَّهٗ عَلِیْمٌ قَدِیْرٌ ﴿۵۰﴾

50. లేదా! వారికి కుమారులను మరియు కుమార్తెలను కలిపి ప్రసాదిస్తాడు. మరియు తాను కోరిన వారికి అసలు సంతానమే ఇవ్వడు. నిశ్చయంగా, ఆయన సర్వజ్ఞుడు, అంతా చేయగల సమర్థుడు. (**3/8**)

وَمَا كَانَ لِبَشَرٍ اَنْ یُّكَلِّمَهُ اللّٰهُ اِلَّا وَحْیًا اَوْ مِنْ وَّرَآئِ حِجَابٍ اَوْ یُرْسِلَ رَسُوْلًا فَیُوْحِیَ بِاِذْنِهٖ مَا یَشَآءُ ؕ اِنَّهٗ عَلِیٌّ حَكِیْمٌ ﴿۵۱﴾

51. * మరియు అల్లాహ్‌తో మాట్లాడ గలిగే శక్తి ఏ మానవునికీ లేదు; కేవలం దివ్యజ్ఞానం (వ'హీ) ద్వారా లేదా తెరవెనుక నుండి, లేదా ఆయన పంపిన సందేశహరుని ద్వారా, ఆయన అనుమతితో, ఆయన కోరిన (వ'హీ) అవతరింపజేయబడటం తప్ప![33] నిశ్చయంగా ఆయన మహోన్నతుడు, మహా వివేకవంతుడు.

---

33. ఈ ఆయత్‌లో దివ్యజ్ఞానం (వ'హీ) అవతరింపజేయబడే మూడు విధానాలు పేర్కొనబడ్డాయి: (**1**) హృదయంలో ఒక విషయం వేయబడటం, లేక స్వప్నంలో వినిపింపజేయబడటం - ఇది అల్లాహ్ (సు.తా.) తరఫు నుండియే ఉందనే దృఢనమ్మకంతో! (**2**) తెర వెనక నుండి వినిపింపజేయబడటం - ఏవిధంగానైతే మూసా ('అ.స.)కు 'తూర్ పర్వతం మీద వినిపించబడిందో! (**3**) దైవదూత ('అలైహిమ్ స.)ల ద్వారా అల్లాహ్ (సు.తా.) తన వ'హీని పంపటం. ఏ విధంగానైతే దైవప్రవక్త ('స'అస) దగ్గరకు జిబ్రీల్ ('అ.స.) వ'హీని తీసుకొని వచ్చేవారో! చూడండి, **53:10**.

52. మరియు ఇదేవిధంగా (ఓ ము'హమ్మద్!) మేము మా ఆజ్ఞతో నీ వద్దకు దివ్యజ్ఞానం (రూ'హ్) అవతరింపజేశాము.[34] (దీనికి ముందు) నీకు గ్రంథమేమిటో మరియు విశ్వాసమేమిటో తెలియదు. కాని మేము దీనిని (ఈ ఖుర్ఆన్‌ను) జ్యోతిగా జేసి, దీనిద్వారా మా దాసులలో మేము కోరిన వారికి, మార్గదర్శకత్వం చేస్తాము.[35] మరియు నిశ్చయంగా, నీవు (ప్రజలకు) ఋజుమార్గం వైపునకు దారిచూపుతున్నావు -

وَكَذٰلِكَ اَوۡحَيۡنَاۤ اِلَيۡكَ رُوۡحًا مِّنۡ اَمۡرِنَا ؕ مَا كُنۡتَ تَدۡرِىۡ مَا الۡكِتٰبُ وَلَا الۡاِيۡمَانُ وَلٰـكِنۡ جَعَلۡنٰهُ نُوۡرًا نَّهۡدِىۡ بِهٖ مَنۡ نَّشَآءُ مِنۡ عِبَادِنَا ؕ وَاِنَّكَ لَتَهۡدِىۡۤ اِلٰى صِرَاطٍ مُّسۡتَقِيۡمٍ ۙ﴿۵۲﴾

53. అల్లాహ్ మార్గం![36] భూమ్యాకాశాలలో నున్న ప్రతిదీ ఆయనకే చెందుతుంది. వాస్తవానికి, వ్యవహారాలన్నీ చివరకు (తీర్పు కొరకు) అల్లాహ్ వద్దకే చేరుతాయి.

صِرَاطِ اللّٰهِ الَّذِىۡ لَهٗ مَا فِى السَّمٰوٰتِ وَمَا فِى الۡاَرۡضِ ؕ اَلَاۤ اِلَى اللّٰهِ تَصِيۡرُ الۡاُمُوۡرُ ﴿۵۳﴾

*****

34. రూ'హున్: ఇక్కడ దివ్య జ్ఞానం (ఖుర్ఆన్) అనే అర్థమిస్తోంది. ఎందుకంటే ఖుర్ఆన్ వల్ల హృదయాలకు 'జీవం' లభిస్తుంది. ఏ విధంగానైతే రూ'హ్‌తో మానవునికి జీవం లభిస్తుందో! చూడండి, **16:2, 40:15.**

35. చూడండి, **41:44.**

36. అంటే ఇస్లాం.

***

43. సూరహ్ అ'జ్-'జు'ఖ్రుఫ్

سُوْرَةُ الزُّخْرُفِ

'జు'ఖ్రుఫ్: అంటే బంగారం, ఆభరణాలు లేక అలంకరణ. 'హా మీమ్ వరుసలో ఈ సూరహ్ నాలుగవది. దీని పేరు 35వ ఆయత్ నుండి తీసుకోబడింది. ప్రజలు తమ తండ్రి తాతలు అనుసరించే ధర్మాలను అంధవిశ్వాసంతో అనుసరిస్తూ, అల్లాహ్ (సు.తా.) ప్రసాదించిన విచక్షణాజ్ఞానాన్ని ఉపయోగించకపోవటం వల్లనే మార్గభ్రష్టత్వంలో పడి పోతున్నారు. మక్కాలో అవతరింపజేయబడిన ఈసూరహ్‌లో 89 ఆయతులు ఉన్నాయి.

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

حٰمٓ ﴿١﴾

1. 'హా-మీమ్.

وَالْكِتٰبِ الْمُبِيْنِ ﴿٢﴾

2. స్పష్టమైన ఈ గ్రంథం (ఖుర్ఆన్) సాక్షిగా![1]

اِنَّا جَعَلْنٰهُ قُرْءٰنًا عَرَبِيًّا لَّعَلَّكُمْ تَعْقِلُوْنَ ﴿٣﴾

3. నిశ్చయంగా, మీరు అర్థం చేసుకో గలగటానికి, మేము దీనిని అరబ్బీ భాషలో ఖుర్ఆన్‌గా [2] అవతరింపజేశాము.

وَاِنَّهٗ فِيْٓ اُمِّ الْكِتٰبِ لَدَيْنَا لَعَلِيٌّ حَكِيْمٌ ﴿٤﴾

4. మరియు నిశ్చయంగా, ఇది మా వద్ద నున్న మాతృ గ్రంథంలోనిదే![3] అది మహోన్నతమైనది, వివేకంతో నిండిఉన్నది.

اَفَنَضْرِبُ عَنْكُمُ الذِّكْرَ صَفْحًا اَنْ كُنْتُمْ قَوْمًا مُّسْرِفِيْنَ ﴿٥﴾

5. ఏమిటి? మీరు మితిమీరి ప్రవర్తిస్తున్నారని, మేము ఈ హితోపదేశాన్ని (ఖుర్ఆన్‌ను) మీనుండి తొలగించాలా?[4]

---

1. చూడండి, 12:1.
2. ఖుర్ఆనున్ / ఖుర్ఆనన్: దీని పదార్థాలు సంభాషణ, ప్రసంగం, ఉపన్యాసం, పఠనగ్రంథం, Recitation, Talk, Lecture, Discourse, Sermon, అని ఉన్నాయి. అల్ ఖుర్ఆను అంటే ఈ ఖుర్ఆన్ గ్రంథం. అల్-ఖుర్ఆనుల్-కరీమ్ అంటే The Glorious Quran, ఈ దివ్యఖుర్ఆన్.
3. ఉమ్ముల్-కితాబ్: చూడండి, 13:39, 85:22. అంటే లౌ'హె మ'హ్ఫూ"జ్. మాతృ గ్రంథం, సురక్షితమైన ఫలకం, మూలగ్రంథం. అంటే యథాస్థితిలో, భద్రంగా ఉంచబడిన గ్రంథం.
4. మీరు మితిమీరి ప్రవర్తిస్తున్నారని మేము మీకు హితబోధ చేయటం మానుకుంటామని భావిస్తున్నారా? (ఇబ్నె-కసీ'ర్).

وَكَمْ اَرْسَلْنَا مِنْ نَّبِيٍّ فِى الْاَوَّلِيْنَ ۝٦

6. మరియు మేము పూర్వం గతించిన వారివద్దకు ఎంతోమంది ప్రవక్తలను పంపాము.

وَمَا يَاْتِيْهِمْ مِّنْ نَّبِيٍّ اِلَّا كَانُوْا بِهٖ يَسْتَهْزِءُوْنَ ۝٧

7. మరియు వారు, తమ వద్దకు వచ్చిన ప్రవక్తలలో ఏ ఒక్కరిని కూడా ఎగతాళి చేయకుండా వదలలేదు.

فَاَهْلَكْنَآ اَشَدَّ مِنْهُمْ بَطْشًا وَّمَضٰى مَثَلُ الْاَوَّلِيْنَ ۝٨

8. కావున వీరికంటే ఎంతో బలిష్ఠులైన వారిని మేము పట్టుకొని నాశనంచేశాము.[5] మరియు పూర్వజాతుల వారి దృష్టాంతాలు ఈ విధంగా గడిచాయి.

وَلَئِنْ سَاَلْتَهُمْ مَّنْ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ لَيَقُوْلُنَّ خَلَقَهُنَّ الْعَزِيْزُ الْعَلِيْمُ ۝٩

9. ఒకవేళ, నీవు వారితో: "భూమ్యా కాశాలను ఎవరు సృష్టించారు?" అని అడిగితే! వారు తప్పక: "వాటిని సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు సృష్టించాడు." అని అంటారు.

الَّذِىْ جَعَلَ لَكُمُ الْاَرْضَ مَهْدًا وَّجَعَلَ لَكُمْ فِيْهَا سُبُلًا لَّعَلَّكُمْ تَهْتَدُوْنَ ۝١٠

10. ఆయనే మీ కొరకు ఈ భూమిని పరుపుగా చేశాడు; మరియు మీరు మీ గమ్యస్థానాలకు చేరుకోవడానికి, అందులో మీ కొరకు త్రోవలు ఏర్పరచాడు.[6]

وَالَّذِىْ نَزَّلَ مِنَ السَّمَآءِ مَآءًۢ بِقَدَرٍ ۚ فَاَنْشَرْنَا بِهٖ بَلْدَةً مَّيْتًا ۚ كَذٰلِكَ تُخْرَجُوْنَ ۝١١

11. మరియు ఆయనే ఆకాశంనుండి తగినంత నీటిని (వర్షాన్ని) కురిపించాడు. తరువాత దాని ద్వారా మేము చచ్చిన నేలను బ్రతికిస్తాము. ఇదేవిధంగా మీరు కూడా (బ్రతికింపబడి) బయటికి తీయబడతారు.

وَالَّذِىْ خَلَقَ الْاَزْوَاجَ كُلَّهَا وَجَعَلَ لَكُمْ مِّنَ الْفُلْكِ وَالْاَنْعَامِ مَا تَرْكَبُوْنَ ۝١٢

12. మరియు ఆయనే అన్నిరకాల జతలను పుట్టించాడు! మరియు ఓడలను మరియు పశువులను మీకు వాహనాలుగా చేశాడు;

---

5. అంటే వారు మక్కాముష్రికుల కంటే ఎక్కువ బలవంతులు. ఇంకా చూడండి, **40:82**.
6. చూడండి, **20:53**.

لِتَسْتَوٗا عَلٰى ظُهُوْرِهٖ ثُمَّ تَذْكُرُوْا نِعْمَةَ رَبِّكُمْ اِذَا اسْتَوَيْتُمْ عَلَيْهِ وَتَقُوْلُوْا سُبْحٰنَ الَّذِيْ سَخَّرَ لَنَا هٰذَا وَمَا كُنَّا لَهٗ مُقْرِنِيْنَ ۝١٣

13. మీరు వాటి వీపుల మీద ఎక్కటానికి; తరువాత మీరు వాటిమీద కూర్చున్నప్పుడు, మీ ప్రభువు అనుగ్రహాన్ని తలచుకొని ఇలా ప్రార్థించటానికి: "ఆ సర్వలోపాలకు అతీతుడైన ఆయన (అల్లాహ్) వీటిని మాకు వశపరచాడు, లేకపోతే ఆ (వశపరచుకునే) సామర్థ్యం మాకు లేదు.

وَاِنَّآ اِلٰى رَبِّنَا لَمُنْقَلِبُوْنَ ۝١٤

14. "మరియు నిశ్చయంగా, మేము మా ప్రభువు వైపునకే మరలిపోవలసి ఉన్నది!"[7]

وَجَعَلُوْا لَهٗ مِنْ عِبَادِهٖ جُزْءًا ۭ اِنَّ الْاِنْسَانَ لَكَفُوْرٌ مُّبِيْنٌ ۝١٥ؕ

15. మరియు వారు ఆయన దాసులలో కొందరిని ఆయనలో భాగంగా (భాగ స్వాములుగా / సంతానంగా) చేశారు.[8] నిశ్చయంగా మానవుడు పరమ కృతఘ్నుడు!

اَمِ اتَّخَذَ مِمَّا يَخْلُقُ بَنٰتٍ وَّاَصْفٰىكُمْ بِالْبَنِيْنَ ۝١٦

16. ఏమిటి? ఆయన తాను సృష్టించిన వాటిలో నుండి తనకొరకు కుమార్తెలను తీసుకొని మీ కొరకు ప్రత్యేకంగా కుమారులను ఉంచాడా?[9]

وَاِذَا بُشِّرَ اَحَدُهُمْ بِمَا ضَرَبَ لِلرَّحْمٰنِ مَثَلًا ظَلَّ وَجْهُهٗ مُسْوَدًّا وَّهُوَ كَظِيْمٌ ۝١٧

17. మరియు వారు, కరుణామయునికి అంటగట్టేది (ఆడ సంతానమే గనక) వారిలో ఎవడికైనా కలిగిందనే వార్త అందజేయబడి నప్పుడు, అతని ముఖం నల్లబడిపోతుంది మరియు అతడు దుఃఖంలో మునిగిపోతాడు!

اَوَمَنْ يُّنَشَّؤُا فِي الْحِلْيَةِ وَهُوَ فِي الْخِصَامِ غَيْرُ مُبِيْنٍ ۝١٨

18. ఏమీ? ఆభరణాల అలంకారంలో పెంచబడి మరియు వివాదంలో తన అభిప్రాయాన్ని స్పష్టంగా వివరించలేని (స్త్రీ) సంతానాన్ని అల్లాహ్‌కు అంటగట్టుతున్నారా)?

---

7. దైవప్రవక్త ('స'అస) తమ వాహనం ఎక్కినప్పుడు: మూడు సార్లు అల్లాహు అక్బర్ తరువాత "సుబ'హానల్లజీ' స'ఖ్ఖరలనా హాజా' వ మా కున్నా లహూ ముఖ్రినీన్. వ ఇన్నా ఇలా రబ్బినా లమున్‌ఖలిబూన్!" వరకు ఈ ఆయత్‌లు (**43:13-14**) చదివే వారు. ('స. ముస్లిం).
8. వారు (ముష్రికులు) దైవదూత ('అలైహిమ్ స.)లను అల్లాహ్ (సు.తా.) కుమార్తెలుగా భావించే వారు. ఇక్కడ 'ఇబాదున్ దాసులు, అంటే దైవదూతలు మరియు జు'జ్‌అన్ అంటే కుమార్తెలు. ఇంకా చూడండి, **6:100**.
9. చూడండి, **16:57-59**.

وَجَعَلُوا الْمَلٰٓئِكَةَ الَّذِيْنَ هُمْ عِبٰدُ الرَّحْمٰنِ
اِنَاثًا ؕ اَشَهِدُوْا خَلْقَهُمْ ؕ سَتُكْتَبُ شَهَادَتُهُمْ
وَيُسْـَٔلُوْنَ ﴿١٩﴾

19. మరియు వీరు కరుణామయునికి దాసులైన దేవదూతలను స్త్రీలుగా పరిగణిస్తున్నారా? వీరు! వారు (దేవదూతలు) సృష్టింపబడినప్పుడు చూశారా ఏమిటి? వీరి ఆరోపణలు వ్రాసివుంచబడతాయి. మరియు వీరు దానిని గురించి ప్రశ్నింపబడతారు.

وَقَالُوْا لَوْ شَآءَ الرَّحْمٰنُ مَا عَبَدْنٰهُمْ ؕ مَا لَهُمْ بِذٰلِكَ
مِنْ عِلْمٍ ۚ اِنْ هُمْ اِلَّا يَخْرُصُوْنَ ﴿٢٠﴾

20. మరియు వారు ఇలా అంటారు: "ఒకవేళ ఆ కరుణామయుడు తలచుకుంటే మేము వారిని ఆరాధించేవారం కాదు." దాని వాస్తవజ్ఞానం వారికి లేదు. వారు కేవలం ఊహాగానాలే చేస్తున్నారు!

اَمْ اٰتَيْنٰهُمْ كِتٰبًا مِّنْ قَبْلِهٖ فَهُمْ بِهٖ مُسْتَمْسِكُوْنَ ﴿٢١﴾

21. మేము వారికి ఇంతకు ముందు ఏదైనా గ్రంథాన్ని ఇచ్చి ఉన్నామా ఏమిటి? వారు దానిని ఖచ్చితంగా అనుసరించటానికి?

بَلْ قَالُوْٓا اِنَّا وَجَدْنَآ اٰبَآءَنَا عَلٰٓى اُمَّةٍ وَّاِنَّا عَلٰٓى
اٰثٰرِهِمْ مُّهْتَدُوْنَ ﴿٢٢﴾

22. అలాకాదు! వారిలా అంటారు: "వాస్తవానికి మేము, మా తండ్రితాతలను ఇలాంటి సమాజాన్నే (మతాన్నే) అనుసరిస్తుండగా చూశాము. మరియు నిశ్చయంగా, మేము కూడా వారి అడుగుజాడల్లోనే వారి మార్గదర్శకత్వంపై ఉన్నాము."

وَكَذٰلِكَ مَآ اَرْسَلْنَا مِنْ قَبْلِكَ فِيْ قَرْيَةٍ مِّنْ
نَّذِيْرٍ اِلَّا قَالَ مُتْرَفُوْهَآ ۙ اِنَّا وَجَدْنَآ اٰبَآءَنَا عَلٰٓى
اُمَّةٍ وَّاِنَّا عَلٰٓى اٰثٰرِهِمْ مُّقْتَدُوْنَ ﴿٢٣﴾

23. మరియు ఇదే విధంగా, నీకు ముందు (ఓ ము'హమ్మద్!) మేము హెచ్చరించే వాడిని ఏ పట్టణానికిపంపినా దానిలోని ఐశ్వర్యవంతులు అనేవారు:[10] "వాస్తవానికి మేము మా తండ్రితాతలను ఇలాంటి సమాజాన్నే (మతాన్నే) అనుసరిస్తూ ఉండగా చూశాము. మరియు నిశ్చయంగా, మేము కూడా వారి అడుగుజాడలనే అనుసరిస్తాము."**(1/2)**

قٰلَ اَوَلَوْ جِئْتُكُمْ بِاَهْدٰى مِمَّا وَجَدْتُّمْ عَلَيْهِ اٰبَآءَكُمْ ؕ
قَالُوْٓا اِنَّا بِمَآ اُرْسِلْتُمْ بِهٖ كٰفِرُوْنَ ﴿٢٤﴾

24. * (వారి ప్రవక్త) ఇలా అనేవాడు: "ఒకవేళ నేను మీ తండ్రితాతలు అనుసరిస్తూ వచ్చిన దానికంటే ఉత్తమమైన మార్గ

---

10. చూడండి, **11:116**.

దర్శకత్వాన్ని మీ కోసం తెచ్చినా (మీరు వారినే అనుసరిస్తారా)?" వారిలా జవాబిచ్చే వారు: "నిశ్చయంగా, మీరు దేనితో పంపబడ్డారో దానిని మేము తిరస్కరిస్తున్నాము."

فَانْتَقَمْنَا مِنْهُمْ فَانْظُرْ كَيْفَ كَانَ عَاقِبَةُ الْمُكَذِّبِينَ ﴿٢٥﴾

25. కావున మేము వారిపై మా ప్రతీకారాన్ని (శిక్షను) పంపాము. చూశారా! సత్యాన్ని తిరస్కరించిన వారిగతి ఏమయిందో!

وَإِذْ قَالَ إِبْرَاهِيمُ لِأَبِيهِ وَقَوْمِهِ إِنَّنِي بَرَاءٌ مِمَّا تَعْبُدُونَ ﴿٢٦﴾

26. మరియు (జ్ఞాపకం చేసుకోండి) ఇబ్రాహీమ్ తన తండ్రి మరియు తన జాతి వారితో ఇలా అన్నప్పుడు: "నిశ్చయంగా, మీరు పూజించేవారితో నాకు ఎలాంటి సంబంధం లేదు.[11]

إِلَّا الَّذِي فَطَرَنِي فَإِنَّهُ سَيَهْدِينِ ﴿٢٧﴾

27. "(నేనైతే) నన్ను సృజించిన ఆయన (అల్లాహ్‌నే ఆరాధిస్తాను). ఎందుకంటే! నిశ్చయంగా, ఆయనే నాకు మార్గదర్శకత్వం చేయగలడు."

وَجَعَلَهَا كَلِمَةً بَاقِيَةً فِي عَقِبِهِ لَعَلَّهُمْ يَرْجِعُونَ ﴿٢٨﴾

28. మరియు అతను (ఇబ్రాహీమ్) ఈ వచనాన్నే తన తర్వాత తన సంతానం కొరకు విడిచి వెళ్ళాడు.[12] బహుశా వారు దానివైపుకు మరలుతారని!

بَلْ مَتَّعْتُ هَٰؤُلَاءِ وَآبَاءَهُمْ حَتَّىٰ جَاءَهُمُ الْحَقُّ وَرَسُولٌ مُبِينٌ ﴿٢٩﴾

29. వాస్తవానికి, నేను వారికి మరియు వారి తండ్రితాతలకు ప్రాపంచిక సుఖసంతోషాలను ఇస్తూనే వచ్చాను. చివరకు వారి వద్దకు సత్యం మరియు (దానిని) స్పష్టంగా వివరించే దైవప్రవక్త కూడా వచ్చాడు.[13]

---

11. ఇబ్రాహీమ్ ('అ.స.) గాథకు చూడండి, **6:74** మరియు **21:51**.
12. చూడండి, **2:132**.
13. చూడండి, **21:44**.

وَلَمَّا جَآءَهُمُ الْحَقُّ قَالُوْا هٰذَا سِحْرٌ وَّاِنَّا بِهٖ كٰفِرُوْنَ ﴿٣٠﴾

30. కాని వారివద్దకు సత్యం (ఈ ఖుర్ఆన్) వచ్చినపుడు వారన్నారు: "ఇది కేవలం మంత్రజాలమే.[14] మరియు నిశ్చయంగా మేము దీనిని తిరస్కరిస్తున్నాము."

وَقَالُوْا لَوْلَا نُزِّلَ هٰذَا الْقُرْاٰنُ عَلٰى رَجُلٍ مِّنَ الْقَرْيَتَيْنِ عَظِيْمٍ ﴿٣١﴾

31. వారు ఇంకా ఇలా అన్నారు: "ఈ ఖుర్ఆన్ ఈరెండు నగరాలలోని ఒక గొప్ప వ్యక్తిపై ఎందుకుఅవతరింపజేయబడలేదు?"[15]

اَهُمْ يَقْسِمُوْنَ رَحْمَتَ رَبِّكَ ۭ نَحْنُ قَسَمْنَا بَيْنَهُمْ مَّعِيْشَتَهُمْ فِى الْحَيٰوةِ الدُّنْيَا وَرَفَعْنَا بَعْضَهُمْ فَوْقَ بَعْضٍ دَرَجٰتٍ لِّيَتَّخِذَ بَعْضُهُمْ بَعْضًا سُخْرِيًّا ۭ وَرَحْمَتُ رَبِّكَ خَيْرٌ مِّمَّا يَجْمَعُوْنَ ﴿٣٢﴾

32. నీ ప్రభువు కారుణ్యాన్ని పంచిపెట్టే వారు వారేనా ఏమిటి? మేమే వారి జీవనోపాయాలను, ఈ ప్రాపంచిక జీవితంలో వారిమధ్య పంచిపెట్టాము. వారు ఒకరితో నొకరు పనితీసుకోవటానికి,[16] వారిలో కొందరికి మరికొందరిపై స్థానాలను పెంచాము. మరియు వారు కూడబెట్టే దాని (సంపద) కంటే నీ ప్రభువు కారుణ్యమే[17] ఎంతో ఉత్తమమైనది.

وَلَوْلَآ اَنْ يَّكُوْنَ النَّاسُ اُمَّةً وَّاحِدَةً لَّجَعَلْنَا لِمَنْ يَّكْفُرُ بِالرَّحْمٰنِ لِبُيُوْتِهِمْ سُقُفًا مِّنْ فِضَّةٍ وَّمَعَارِجَ عَلَيْهَا يَظْهَرُوْنَ ﴿٣٣﴾

33. మరియు మానవులందరూ ఒక (దుష్ట) సమాజంగా మారిపోతారన్న భయమే గనక మాకు లేకున్నట్లయితే, మేము ఆ కరుణామయుణ్ణి తిరస్కరించే వారి ఇళ్ళ కప్పులనూ మరియు వాటిపైకి ఎక్కే మెట్లను వెండితో నిర్మించేవారము.

وَلِبُيُوْتِهِمْ اَبْوَابًا وَّسُرُرًا عَلَيْهَا يَتَّكِـُٔوْنَ ﴿٣٤﴾

34. మరియు వారి ఇండ్ల తలుపులను మరియు వారు ఆనుకొని కూర్చునే పీఠాలను కూడా;

---

14. చూడండి, 74:24.

15. ఈ రెండు నగరవాసులలో పేరు ప్రఖ్యాతులున్న మక్కాకు చెందిన వలీద్ బిన్ ము'గైరా మరియు 'తాయఫ్‌కు చెందిన 'ఉర్వా బిన్ మస'వూద్ స'ఖఫీ కావచ్చని వ్యాఖ్యాతలంటారు.

16. అల్లాహ్ (సు.తా.) వ్యవహారాలను సరళంగా నడపటానికి, ప్రజలలో ధనసంపత్తులను, తెలివి జ్ఞానాలను, ఎక్కువ తక్కువగా పంచాడు. దీనివల్ల ప్రతి మానవుడు మరొకని సహాయం మీద ఆధారపడి ఉన్నాడు. ధనవంతుడు పేదవాని మీద పేదవాడు ధనవంతుని మీద.

17. ఈ కారుణ్యం అంటే పరలోక జీవితసుఖం.

وَزُخْرُفًا ۚ وَإِن كُلُّ ذَٰلِكَ لَمَّا مَتَاعُ الْحَيَوٰةِ الدُّنْيَا ۚ وَالْآخِرَةُ عِندَ رَبِّكَ لِلْمُتَّقِينَ ٣٥

35. మరియు బంగారంతో కూడా![18] మరియు ఇవన్నీ ప్రాపంచిక జీవిత సుఖసంతోషాలు మాత్రమే. మరియు దైవభీతి గలవారికి నీ ప్రభువు వద్ద పరలోకజీవిత (సుఖం) ఉంటుంది.

وَمَن يَعْشُ عَن ذِكْرِ الرَّحْمَٰنِ نُقَيِّضْ لَهُ شَيْطَٰنًا فَهُوَ لَهُ قَرِينٌ ٣٦

36. మరియు ఎవడైతే కరుణామయుని స్మరణ విషయంలో అంధుడిగా ప్రవర్తిస్తాడో అతనిపై మేము ఒక షై'తాన్‌ను నియమిస్తాము. ఇక వాడు (ఆ షై'తాన్) వాని సహచరుడు (ఖరీనున్) అవుతాడు.[19]

وَإِنَّهُمْ لَيَصُدُّونَهُمْ عَنِ السَّبِيلِ وَيَحْسَبُونَ أَنَّهُم مُّهْتَدُونَ ٣٧

37. మరియు నిశ్చయంగా, వారు (షై'తాన్‌లు) వారిని (అల్లాహ్) మార్గం నుండి ఆటంకపరుస్తారు. మరియు వారేమో నిశ్చయంగా, తాము సరైన మార్గదర్శకత్వంలోనే ఉన్నామని భావిస్తారు!

حَتَّىٰٓ إِذَا جَآءَنَا قَالَ يَٰلَيْتَ بَيْنِى وَبَيْنَكَ بُعْدَ الْمَشْرِقَيْنِ فَبِئْسَ الْقَرِينُ ٣٨

38. చివరకు అతడు మా వద్దకు వచ్చినపుడు (తన వెంటఉన్న షై'తాన్‌తో) ఇలా అంటాడు: "అయ్యో, నా దౌర్భాగ్యం! నీకూ నాకూ మధ్య తూర్పు పడమరల[20] మధ్య ఉన్నంత దూరం ఉండివుంటే ఎంత బాగుండేది! ఎందుకంటే నీవు అతిచెడ్డ సహచరుడివి!"

وَلَن يَنفَعَكُمُ الْيَوْمَ إِذ ظَّلَمْتُمْ أَنَّكُمْ فِى الْعَذَابِ مُشْتَرِكُونَ ٣٩

39. మరియు మీరు దుర్మార్గం చేశారు! కావున, ఈ రోజు మీరంతా ఈ శిక్షలో కలిసి ఉండటం మీకు ఏమాత్రం లాభదాయకంకాదు.[21]

---

18. 'జు'ఖ్రుఫున్: బంగారం. దీని అర్థం ఆభరణాలు లేక అలంకరణ కూడా అవుతుంది. చూడండి, **10:24**. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: "అల్లాహ్ (సు.తా.) దగ్గర ఈ ప్రపంచపు విలువ దోమరెక్కకు సమానంగా ఉండి ఉన్నా, అల్లాహ్ (సు.తా.) ఏ సత్యతిరస్కారిని గుటికెడు నీళ్ళుకూడా త్రాగనిచ్చేవాడు కాదు." (తిర్మిజీ', ఇబ్నె మాజహ్).

19. చూడండి, **41:25**.

20. అల్-మష్‌రిఖైన్: ప్రాచీన అరబ్బీభాషా సంప్రదాయం ప్రకారం కొన్నిసార్లు ఒక శబ్దానికి ద్వివచనం ఇవ్వటం వల్ల దాని అర్థం రెండు విభిన్న వస్తువులను సూచిస్తుంది. ఉదా: ఇక్కడ వ్రాసినట్లు అల్-మష్‌రిఖైన్, అంటే తూర్పుపడమరలు; ఖమరైన్, అంటే సూర్యచంద్రులు.

21. ఈ ఆయత్‌కు ఈ విధంగా కూడా తాత్పర్యం ఇవ్వబడింది: 'మరియు మీరు దుర్మార్గం

أَفَأَنتَ تُسْمِعُ ٱلصُّمَّ أَوْ تَهْدِى ٱلْعُمْىَ وَمَن كَانَ فِى ضَلَـٰلٍ مُّبِينٍ ﴿٤٠﴾

40. (ఓ ము'హమ్మద్!) నీవు చెవిటివాడికి వినిపింపజేయగలవా? లేదా గ్రుడ్డివాడికి మార్గం చూపించగలవా? లేక, స్పష్టంగా మార్గ భ్రష్టత్వంలో ఉన్నవాడికి (మార్గదర్శకత్వం చేయగలవా)?[22]

فَإِمَّا نَذْهَبَنَّ بِكَ فَإِنَّا مِنْهُم مُّنتَقِمُونَ ﴿٤١﴾

41. ఒకవేళ వాస్తవానికి మేము నిన్ను తీసుకొనిపోయినా, వారికి మాత్రం తప్ప కుండా ప్రతీకారం చేస్తాము.

أَوْ نُرِيَنَّكَ ٱلَّذِى وَعَدْنَـٰهُمْ فَإِنَّا عَلَيْهِم مُّقْتَدِرُونَ ﴿٤٢﴾

42. లేదా మేము వారికి వాగ్దానం చేసిన దానిని (శిక్షను) నీకు తప్పక చూపగలము. ఎందుకంటే మాకు వారిపై పూర్తి అధికారముంది.

فَٱسْتَمْسِكْ بِٱلَّذِىٓ أُوحِىَ إِلَيْكَ ۖ إِنَّكَ عَلَىٰ صِرَٰطٍ مُّسْتَقِيمٍ ﴿٤٣﴾

43. కావున నీవు దివ్యజ్ఞానం (వ'హీ) ద్వారా వచ్చిన సందేశం మీద స్థిరంగా ఉండు. నిశ్చయంగా, నీవు ఋజుమార్గం మీద ఉన్నావు.

وَإِنَّهُۥ لَذِكْرٌ لَّكَ وَلِقَوْمِكَ ۖ وَسَوْفَ تُسْـَٔلُونَ ﴿٤٤﴾

44. మరియు నిశ్చయంగా, ఇది (ఈ ఖుర్ఆన్) నీకు మరియు నీ జాతివారికి ఒక హితబోధ. మరియు (దీనిని గురించి) మీరు ప్రశ్నింపబడగలరు.[23]

وَسْـَٔلْ مَنْ أَرْسَلْنَا مِن قَبْلِكَ مِن رُّسُلِنَآ أَجَعَلْنَا مِن دُونِ ٱلرَّحْمَـٰنِ ءَالِهَةً يُعْبَدُونَ ﴿٤٥﴾

45. మరియు (ఓ ము'హమ్మద్!) నీకు పూర్వం మేము పంపిన మా ప్రవక్తలను అడుగు: "మేము,ఆకరుణామయుడుతప్పఇతర దైవాలను ఆరాధింపబడటానికి నియమించా మేమో?"

وَلَقَدْ أَرْسَلْنَا مُوسَىٰ بِـَٔايَـٰتِنَآ إِلَىٰ فِرْعَوْنَ وَمَلَإِي۟هِۦ فَقَالَ إِنِّى رَسُولُ رَبِّ ٱلْعَـٰلَمِينَ ﴿٤٦﴾

46. మరియు వాస్తవంగా, మేము మూసాను, మా సూచనలతో (ఆయాత్‌లతో) ఫిర్'ఔన్ మరియు అతని నాయకుల వద్దకు పంపాము. అతను వారితో ఇలా అన్నాడు: "నిశ్చయంగా, నేను సర్వలోకాల ప్రభువు యొక్క సందేశహరుణ్ణి."

చేశారు, అది ఈ రోజు మీకు ఏ మాత్రం లాభదాయకం కాదు; నిశ్చయంగా, మీరందరు ఈ శిక్షను పంచుకుంటారు.' ఇంకా చూడండి, 14:49.

22. చూడండి, 35:22.

23. ప్రవక్తలందరూ ప్రశ్నింపబడతారు. చూడండి, 5:109.

فَلَمَّا جَآءَهُمْ بِاٰيٰتِنَآ اِذَا هُمْ مِّنْهَا يَضْحَكُوْنَ ﴿٤٧﴾

47. కాని, అతను వారి వద్దకు మా సూచనలను(ఆయాత్‌లను)తీసుకొనివచ్చినప్పుడు వారు వాటిని గురించి పరిహాస లాడే వారు.[24]

وَمَا نُرِيْهِمْ مِّنْ اٰيَةٍ اِلَّا هِيَ اَكْبَرُ مِنْ اُخْتِهَا ۡ وَاَخَذْنٰهُمْ بِالْعَذَابِ لَعَلَّهُمْ يَرْجِعُوْنَ ﴿٤٨﴾

48. మరియు మేము వారికి చూపిన ప్రతి అద్భుత సూచన (ఆయత్), దానికి ముందు చూపినటువంటి దాని (అద్భుత సూచన) కంటే మించినదిగా ఉండేది.[25] మరియు మేము వారిని శిక్షకు గురిచేశాము. బహుశా, ఇలాగైనా వారు మరలి వస్తారేమోనని![26]

وَقَالُوْا يٰٓاَيُّهَ السّٰحِرُ ادْعُ لَنَا رَبَّكَ بِمَا عَهِدَ عِنْدَكَ ۚ اِنَّنَا لَمُهْتَدُوْنَ ﴿٤٩﴾

49. మరియు వారు (మూసాతో) ఇలా అన్నారు: "ఓ మాంత్రికుడా! (నీ ప్రభువు) నీతో చేసిన ఒప్పందం ప్రకారం నీ ప్రభువును ప్రార్థించు, మేము తప్పక సన్మార్గుల మవుతాము."

فَلَمَّا كَشَفْنَا عَنْهُمُ الْعَذَابَ اِذَا هُمْ يَنْكُثُوْنَ ﴿٥٠﴾

50. కాని మేము వారి పైనుండి ఆ శిక్షను తొలగించిన వెంటనే వారు తమ వాగ్దానాన్ని భంగపరచేవారు.

وَنَادٰى فِرْعَوْنُ فِيْ قَوْمِهٖ قَالَ يٰقَوْمِ اَلَيْسَ لِيْ مُلْكُ مِصْرَ وَهٰذِهِ الْاَنْهٰرُ تَجْرِيْ مِنْ تَحْتِيْ ۚ اَفَلَا تُبْصِرُوْنَ ﴿٥١﴾

51. మరియు, ఫిర్'ఔన్ తన జాతి ప్రజలలో ప్రకటిస్తూ ఇలా అన్నాడు: "ఓ నా జాతి ప్రజలారా! ఈజిప్టు (మి'స్ర్) యొక్క సామ్రాజ్యాధిపత్యం నాది కాదా? మరియు ఈ సెలయేళ్ళు నా క్రింద ప్రవహించటం లేదా? ఇది మీకు కనిపించటంలేదా?

اَمْ اَنَا خَيْرٌ مِّنْ هٰذَا الَّذِيْ هُوَ مَهِيْنٌ ۙ وَّلَا يَكَادُ يُبِيْنُ ﴿٥٢﴾

52. "ఈ తుచ్ఛమైన వాడు మరియు (తన మాటను) స్పష్టంగా వివరించలేనివాడి (మూసా) కంటే నేను శ్రేష్ఠుణ్ణి కానా?[27]

---

24. చూడండి, **6:109.**

25. అద్భుత సూచనల కోసం చూడండి, **7:133-135.**

26. అల్లాహ్ (సు.తా.) వైపునకు మరలటం మానవుడు అల్లాహ్ (సు.తా.) ఉనికిని గ్రహించే స్వాభావిక లక్షణం. కాని మానవుడు అల్లాహ్ (సు.తా.) నుండి మరలిపోవటం అతని మానసిక పతనం, ఆధ్యాత్మిక భ్రష్టత్వం. చూడండి, **7:172-173.**

27. మూసా ('అ.స.) సరిగ్గా మాట్లాడలేక పోయేవారు. నత్తినత్తిగా మాట్లాడే వారు (Stammer). దానికి చూడండి **20:27-28.**

فَلَوْلَآ أُلْقِيَ عَلَيْهِ أَسْوِرَةٌ مِّن ذَهَبٍ أَوْ جَآءَ مَعَهُ ٱلْمَلَٰٓئِكَةُ مُقْتَرِنِينَ ﴿٥٣﴾

53. "అయితే ఇతనికి బంగారుకంకణాలు ఎందుకు వేయబడలేదు. లేదా, ఇతనికి తోడుగా ఇతనితోపాటు దేవదూతలు ఎందుకురాలేదు?"[28]

فَٱسْتَخَفَّ قَوْمَهُۥ فَأَطَاعُوهُ ۚ إِنَّهُمْ كَانُوا۟ قَوْمًا فَٰسِقِينَ ﴿٥٤﴾

54. ఈ విధంగా, అతడు (ఫిర్'ఔన్) తన జాతివారిని ప్రేరేపింపజేయటం వలన వారు అతనిని అనుసరించారు. నిశ్చయంగా వారు దుర్జనులు (ఫాసిఖీన్).

فَلَمَّآ ءَاسَفُونَا ٱنتَقَمْنَا مِنْهُمْ فَأَغْرَقْنَٰهُمْ أَجْمَعِينَ ﴿٥٥﴾

55. ఈ విధంగా వారు మమ్మల్ని కోపానికి గురిచేయటం వల్ల, మేము వారికి ప్రతీకారం చేశాము. మరియు వారందరినీ ముంచివేశాము.

فَجَعَلْنَٰهُمْ سَلَفًا وَمَثَلًا لِّلْءَاخِرِينَ ﴿٥٦﴾

56. ఇక మేము, వారిని తర్వాత వచ్చేవారి కొరకు ఒక గడిచిన నిదర్శనంగా మరియు ఒక ఉదాహరణగా చేశాము. **(5/8)**

وَلَمَّا ضُرِبَ ٱبْنُ مَرْيَمَ مَثَلًا إِذَا قَوْمُكَ مِنْهُ يَصِدُّونَ ﴿٥٧﴾

57. * మరియు మర్యమ్ కుమారుడు ఒక ఉదాహరణగా పేర్కొనబడినప్పుడు (ఓ ము'హమ్మద్!) నీ జాతి ప్రజలు అతనిని గురించి కేకలు వేస్తారు.

وَقَالُوٓا۟ ءَأَٰلِهَتُنَا خَيْرٌ أَمْ هُوَ ۚ مَا ضَرَبُوهُ لَكَ إِلَّا جَدَلًۢا ۚ بَلْ هُمْ قَوْمٌ خَصِمُونَ ﴿٥٨﴾

58. మరియు అంటారు: "మా దేవుళ్ళు మంచివా లేక అతడా ('ఈసానా)?" వారు ఈ విషయం నీ ముందు పెట్టేది కేవలం జగడమాడటానికే. వాస్తవానికి వారు కలహప్రియులైన జనులు.

إِنْ هُوَ إِلَّا عَبْدٌ أَنْعَمْنَا عَلَيْهِ وَجَعَلْنَٰهُ مَثَلًا لِّبَنِىٓ إِسْرَٰٓءِيلَ ﴿٥٩﴾

59. అతను ('ఈసా) కేవలం ఒక దాసుడు మాత్రమే. మేము అతనిని అనుగ్రహించాము. మరియు మేము అతనిని ఇస్రాయీ'ల్ సంతతి వారికి ఒక నిదర్శనంగా చేశాము.

---

28. ప్రాచీన కాలంలో ఈజిప్టులో బంగారు కంకణాలు, మెడలలో బంగారు ఆభరణాలు పెద్దరికాన్ని సూచించేవి. (ఆదికాండము-Genesis, **12:42**) అంటే మూసా ('అ.స.) అల్లాహ్ (సు.తా.) సందేశహరుడైతే అల్లాహ్ (సు.తా.), అతనికి, అతని గొప్పతనానికి తగినట్లు బంగారు ఆభరణాలు, కంకణాలు, ఎందుకు ప్రసాదించలేదు? ఇదే విధమైన ప్రశ్నలు ముష్రిక్ ఖురైషులు దైవప్రవక్త ('స'అస)ను కూడా అడిగారు.

وَلَوۡ نَشَآءُ لَجَعَلۡنَا مِنكُم مَّلَٰٓئِكَةٗ فِي ٱلۡأَرۡضِ يَخۡلُفُونَ ٦٠

60. మరియు మేము కోరితే మీకు బదులుగా, దేవదూతలను భూమిపై ఉత్తరాధికారులుగా చేసేవారము.

وَإِنَّهُۥ لَعِلۡمٞ لِّلسَّاعَةِ فَلَا تَمۡتَرُنَّ بِهَا وَٱتَّبِعُونِۚ هَٰذَا صِرَٰطٞ مُّسۡتَقِيمٞ ٦١

61. మరియు నిశ్చయంగా, అతని ('ఈసా పునరాగమనం) అంతిమ ఘడియ రావటానికి సూచన.[29] కావున మీరు దానిని (ఆ ఘడియను) గురించి సంశయంలో పడకండి. మరియు నన్నే (అల్లాహ్‌నే) అనుసరించండి, ఇదే ఋజుమార్గం.

وَلَا يَصُدَّنَّكُمُ ٱلشَّيۡطَٰنُۖ إِنَّهُۥ لَكُمۡ عَدُوّٞ مُّبِينٞ ٦٢

62. మరియు షై'తాన్‌ను, మిమ్మల్ని ఆటంకపరచనివ్వకండి. నిశ్చయంగా అతడు మీకు బహిరంగ శత్రువు.

وَلَمَّا جَآءَ عِيسَىٰ بِٱلۡبَيِّنَٰتِ قَالَ قَدۡ جِئۡتُكُم بِٱلۡحِكۡمَةِ وَلِأُبَيِّنَ لَكُم بَعۡضَ ٱلَّذِي تَخۡتَلِفُونَ فِيهِۖ فَٱتَّقُواْ ٱللَّهَ وَأَطِيعُونِ ٦٣

63. మరియు, 'ఈసా స్పష్టమైన (మా) సూచనలు తీసుకొనివచ్చినప్పుడు ఇలా అన్నాడు: "వాస్తవంగా, నేను మీ వద్దకు వివేకాన్ని తీసుకొనివచ్చాను;[30] మరియు మీరు విభేదాలకులోనైన కొన్ని విషయాల వాస్తవాన్ని మీకు స్పష్టంగా వివరించటానికి వచ్చాను. కావున మీరు అల్లాహ్‌పట్ల భయభక్తులు కలిగి ఉండండి. మరియు నన్ను అనుసరించండి.

إِنَّ ٱللَّهَ هُوَ رَبِّي وَرَبُّكُمۡ فَٱعۡبُدُوهُۚ هَٰذَا صِرَٰطٞ مُّسۡتَقِيمٞ ٦٤

64. "నిశ్చయంగా, అల్లాహ్‌యే నా ప్రభువు మరియు మీ ప్రభువు కూడాను. కావున మీరు ఆయననే ఆరాధించండి. ఇదే ఋజుమార్గం."

فَٱخۡتَلَفَ ٱلۡأَحۡزَابُ مِنۢ بَيۡنِهِمۡۖ فَوَيۡلٞ لِّلَّذِينَ ظَلَمُواْ مِنۡ عَذَابِ يَوۡمٍ أَلِيمٍ ٦٥

65. అయినా, తరువాత వచ్చిన వర్గాల వారు పరస్పర వర్గవిభేదాలకు లోనయ్యారు. కావున దుర్మార్గానికి పాల్పడిన వారికి బాధాకరమైన ఆ దినమున శిక్ష పడుతుంది!

---

29. చాలా మంది వ్యాఖ్యాతల ప్రకారం 'ఈసా ('అ.స.) మరల వచ్చారంటే, పునరుత్థానదినం దగ్గరున్నట్లే! ఇది ఎన్నో 'స'హీ'హ్ 'హదీస్'లలో పేర్కొనబడింది.

30. వివేకం, అంటే దివ్యజ్ఞానం (ప'హీ).

66. వారు కేవలం ఆ అంతిమ ఘడియ అకస్మాత్తుగా - తమకు తెలియకుండానే - తమపై వచ్చిపడాలని నిరీక్షిస్తున్నారా ఏమిటి?

هَلْ يَنظُرُونَ إِلَّا السَّاعَةَ أَن تَأْتِيَهُم بَغْتَةً
وَهُمْ لَا يَشْعُرُونَ ﴿٦٦﴾

67. ఆ దినమున దైవభీతి గలవారు తప్ప ఇతర స్నేహితులంతా ఒకరికొకరు శత్రువులవుతారు.

الْأَخِلَّاءُ يَوْمَئِذٍ بَعْضُهُمْ لِبَعْضٍ عَدُوٌّ إِلَّا
الْمُتَّقِينَ ﴿٦٧﴾

68. (విశ్వాసులతో ఇలా అనబడుతుంది): "ఓ నాదాసులారా! ఈనాడు మీకు ఏ భయమూ లేదు మరియు మీరు దుఃఖపడరు కూడా!

يَا عِبَادِ لَا خَوْفٌ عَلَيْكُمُ الْيَوْمَ وَلَا أَنتُمْ تَحْزَنُونَ ﴿٦٨﴾

69. "అలాంటి వారు, ఎవరైతే మా సూచనలను విశ్వసించారో మరియు ముస్లింలు అయిఉన్నారో!

الَّذِينَ آمَنُوا بِآيَاتِنَا وَكَانُوا مُسْلِمِينَ ﴿٦٩﴾

70. "మీరు మరియు మీ సహవాసులు (అ'జ్వాజ్) సంతోషంగా స్వర్గంలో ప్రవేశించండి."

ادْخُلُوا الْجَنَّةَ أَنتُمْ وَأَزْوَاجُكُمْ تُحْبَرُونَ ﴿٧٠﴾

71. వారి మధ్య, బంగారు పళ్ళాలు[31] మరియు కప్పులు త్రిప్పబడతాయి. మరియు అందులో, మనస్సులు కోరేవి మరియు కళ్ళకు ఇంపుగా ఉండేవి, అన్నీ ఉంటాయి. మరియు మీరందులో శాశ్వతంగా ఉంటారు.

يُطَافُ عَلَيْهِم بِصِحَافٍ مِّن ذَهَبٍ وَأَكْوَابٍ
وَفِيهَا مَا تَشْتَهِيهِ الْأَنفُسُ وَتَلَذُّ الْأَعْيُنُ
وَأَنتُمْ فِيهَا خَالِدُونَ ﴿٧١﴾

72. మరియు మీరు చేస్తూవున్న కర్మల ఫలితానికి బదులుగా, మీరు ఈ స్వర్గానికి వారసులయ్యారు.

وَتِلْكَ الْجَنَّةُ الَّتِي أُورِثْتُمُوهَا بِمَا كُنتُمْ تَعْمَلُونَ ﴿٧٢﴾

73. మీకు అందులో పండ్లూఫలాలు పుష్కలంగా ఉంటాయి, వాటిని మీరు తింటారు.

لَكُمْ فِيهَا فَاكِهَةٌ كَثِيرَةٌ مِّنْهَا تَأْكُلُونَ ﴿٧٣﴾

---

31. 'సి'హాఫున్, 'స'హ్ఫతున్ (ఏ.వ.): Plate, అన్నం తినే పళ్ళెం. అన్నిటి కంటే పెద్ద పళ్ళాన్ని జఫ్నతున్ అంటారు. దాని తరువాత ఖ'స్'అతున్ దీనిలో పదిమంది తినగలుగుతారు. దానిలో సగం ఉండేది 'సహ్ఫతున్, దాని కంటే చిన్నది మికీలతున్. (ఫ'త్హ్ అల్-ఖదీర్).

إِنَّ الْمُجْرِمِينَ فِي عَذَابِ جَهَنَّمَ خٰلِدُونَ ۝٧٤

74. నిశ్చయంగా అపరాధులు నరకశిక్షలో శాశ్వతంగా ఉంటారు.[32]

لَا يُفَتَّرُ عَنْهُمْ وَهُمْ فِيهِ مُبْلِسُونَ ۝٧٥

75. వారి (శిక్ష) ఏ మాత్రం తగ్గించబడదు మరియు వారందులో హతాశులై పడి ఉంటారు.

وَمَا ظَلَمْنٰهُمْ وَلٰكِنْ كَانُوا هُمُ الظّٰلِمِينَ ۝٧٦

76. మేము వారికి ఎలాంటి అన్యాయం చేయలేదు, కాని వారే దుర్మార్గులై ఉండిరి.[33]

وَنَادَوْا يٰمٰلِكُ لِيَقْضِ عَلَيْنَا رَبُّكَ ۖ قَالَ إِنَّكُمْ مّٰكِثُونَ ۝٧٧

77. మరియు వారిలా మొరపెట్టు కుంటారు: "ఓ నరక పాలకుడా (మాలిక్)! నీప్రభువును మమ్మల్ని అంతంచేయమను." అతను అంటాడు: "నిశ్చయంగా మీరిక్కడే (ఇదే విధంగా) పడి ఉంటారు."

لَقَدْ جِئْنٰكُمْ بِالْحَقِّ وَلٰكِنَّ أَكْثَرَكُمْ لِلْحَقِّ كٰرِهُونَ ۝٧٨

78. వాస్తవానికి మేము మీ వద్దకు సత్యాన్ని తీసుకొనివచ్చాము, కాని మీలో చాలామంది సత్యమంటేనే అసహ్యించుకునే వారు.

أَمْ أَبْرَمُوٓا أَمْرًا فَإِنَّا مُبْرِمُونَ ۝٧٩

79. వారు ఏదైనా నిర్ణయం (పన్నాగం) చేస్తున్నారా ఏమిటి? అయితే నిశ్చయంగా, మేము కూడా ఒక గట్టి నిర్ణయం (పన్నాగం) చేస్తున్నాము.[34]

أَمْ يَحْسَبُونَ أَنَّا لَا نَسْمَعُ سِرَّهُمْ وَنَجْوٰىهُمْ ۚ بَلٰى وَرُسُلُنَا لَدَيْهِمْ يَكْتُبُونَ ۝٨٠

80. లేదా! మేము వారి రహస్య విషయాలను మరియు వారి గుసగుసలను వినటంలేదని వారనుకుంటున్నారా? అలా కాదు, (వాస్తవానికి) మా దూతలు వారి దగ్గర ఉండి, అంతా వ్రాస్తున్నారు.

قُلْ إِنْ كَانَ لِلرَّحْمٰنِ وَلَدٌ ۖ فَأَنَا أَوَّلُ الْعٰبِدِينَ ۝٨١

81. వారితో ఇలా అను: "ఒకవేళ ఆ కరుణామయునికి కుమారుడే ఉంటే, అందరికంటే ముందు నేనే అతనిని ఆరాధించే వాడిని."

---

32. చూడండి, **6:128** చివరి వాక్యం మరియు **40:12/3** వ్యాఖ్యానంలో సూచించిన 'హదీస్'.
33. అంటే వారే తమకు తాము అన్యాయం చేసుకున్నారు.
34. చూడండి, **52:42.**

سُبۡحٰنَ رَبِّ السَّمٰوٰتِ وَالۡاَرۡضِ رَبِّ الۡعَرۡشِ عَمَّا يَصِفُوۡنَ ۝٨٢

82. భూమ్యాకాశాలకు ప్రభువు మరియు సింహాసనానికి ('అర్ష్‌కు) ప్రభువు అయిన ఆయన(అల్లాహ్), వారికల్పనలకు అతీతుడు.[35]

فَذَرۡهُمۡ يَخُوۡضُوۡا وَيَلۡعَبُوۡا حَتّٰى يُلٰقُوۡا يَوۡمَهُمُ الَّذِىۡ يُوۡعَدُوۡنَ ۝٨٣

83. వారికి వాగ్దానం చేయబడిన ఆ దినాన్ని వారు దర్శించేవరకు, వారిని వారి వాదోపవాదాలలో మరియు వారి క్రీడలలో మునిగి ఉండనీ!

وَهُوَ الَّذِىۡ فِى السَّمَآءِ اِلٰـهٌ وَّفِى الۡاَرۡضِ اِلٰـهٌ ؕ وَهُوَ الۡحَكِيۡمُ الۡعَلِيۡمُ ۝٨٤

84. మరియు ఆయన (అల్లాహ్) మాత్రమే ఆకాశాలలో ఆరాధ్యుడు మరియు భూమిలో కూడా ఆరాధ్యుడు. మరియు ఆయన మహా వివేకవంతుడు, సర్వజ్ఞుడు.[36]

وَتَبٰرَكَ الَّذِىۡ لَهٗ مُلۡكُ السَّمٰوٰتِ وَالۡاَرۡضِ وَمَا بَيۡنَهُمَا ۚ وَعِنۡدَهٗ عِلۡمُ السَّاعَةِ ۚ وَاِلَيۡهِ تُرۡجَعُوۡنَ ۝٨٥

85. మరియు ఆకాశాలలోను మరియు భూమిలోను మరియు ఆ రెండింటి మధ్యను ఉన్న సమస్తానికీ సామ్రాజ్యాధికారి అయిన ఆయన (అల్లాహ్) శుభదాయకుడు; మరియు అంతిమఘడియ జ్ఞానం కేవలం ఆయనకే ఉంది; మరియు ఆయన వైపునకే మీరంతా మరలింపబడతారు.

وَلَا يَمۡلِكُ الَّذِيۡنَ يَدۡعُوۡنَ مِنۡ دُوۡنِهِ الشَّفَاعَةَ اِلَّا مَنۡ شَهِدَ بِالۡحَقِّ وَهُمۡ يَعۡلَمُوۡنَ ۝٨٦

86. మరియు వారు ఆయనను వదలి, ఎవరినైతే ప్రార్థిస్తున్నారో, వారికి సిఫారసు చేసే అధికారం లేదు.[37] కేవలం సత్యానికి సాక్ష్యమిచ్చేవారు మరియు (అల్లాహ్ ఒక్కడే! అని) తెలిసి ఉన్నవారు తప్ప!

وَلَئِنۡ سَاَلۡتَهُمۡ مَّنۡ خَلَقَهُمۡ لَيَقُوۡلُنَّ اللّٰهُ فَاَنّٰى يُؤۡفَكُوۡنَ ۙ ۝٨٧

87. మరియు నీవు: "మిమ్మల్ని ఎవరు సృష్టించారు?" అని వారితో అడిగినప్పుడు, వారు నిశ్చయంగా: "అల్లాహ్!" అని అంటారు. అయితే వారు ఎందుకు మోసగింప బడుతున్నారు (సత్యంనుండి మరలింప బడుతున్నారు)?

---

35. చూడండి, 6:100.
36. చూడండి, 6:3.
37. చూడండి, 10:3.

88. "మరియు ఓ నా ప్రభూ! నిశ్చయంగా, ఈ ప్రజలు విశ్వసించరు!" అని పలికే (ప్రవక్త యొక్క) మాట (అల్లాహ్‌కు బాగా తెలుసు).

وَقِيلِهِۦ يَٰرَبِّ إِنَّ هَٰٓؤُلَآءِ قَوۡمٞ لَّا يُؤۡمِنُونَ ٨٨

89. కావున నీవు (ఓ ము'హమ్మద్!) వారిని ఉపేక్షించు. మరియు ఇలా అను: "మీకు సలాం!"[38] ముమ్మందు వారు తెలుసుకుంటారు.

فَٱصۡفَحۡ عَنۡهُمۡ وَقُلۡ سَلَٰمٞۚ فَسَوۡفَ يَعۡلَمُونَ ٨٩

*****

38. ఇక్కడ కేవలం సలామున్ ఉంది; అస్సలాము అని లేదు. అంటే మీదారి మీది మరియు మాదారి మాది, అని అర్థం. మీరు ముమ్మందు తెలుసుకుంటారు. ఎవరు సన్మార్గం మీద ఉన్నారో! మరియు ఎవరు దుర్మార్గం మీద ఉన్నారో! ఇంకా చూడండి, **25:63, 28:55**.

***

44. సూరహ్ అద్ దు'ఖాన్

سُوْرَةُ الدُّخَانِ

దు'ఖానున్: పొగ. ఈ సూరహ్ కూడా ఇతర 'హామీమ్ సూరాహ్‌లవలే మక్కా మధ్య కాలపు చివరి భాగంలో అవతరింపజేయబడింది. ఈ సూరాహ్‌లలో ఇది ఐదవది. దీని పేరు 10వ ఆయత్ నుండి తీసుకోబడింది. ఈ సూరహ్ పునరుత్థానదినం సత్యమనీ, అది తప్పక వస్తుందని తెలుపుతోంది మరియు అప్పుడు సంభవించే విషయాలను కూడా వివరిస్తోంది. ఇందులో 59 ఆయతులు ఉన్నాయి.

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

حٰمٓ ۚ ①

1. 'హా-మీమ్.

وَالْكِتٰبِ الْمُبِيْنِ ۙ ②

2. స్పష్టమైన ఈ గ్రంథం సాక్షిగా![1]

اِنَّآ اَنْزَلْنٰهُ فِيْ لَيْلَةٍ مُّبٰرَكَةٍ اِنَّا كُنَّا مُنْذِرِيْنَ ③

3. నిశ్చయంగా, మేము దీనిని (ఈ ఖుర్ఆన్‌ను) శుభప్రదమైన రాత్రిలో అవతరింపజేశాము.[2] నిశ్చయంగా, మేము (ప్రజలను) ఎల్లప్పుడూ హెచ్చరిస్తూ వచ్చాము.[3]

فِيْهَا يُفْرَقُ كُلُّ اَمْرٍ حَكِيْمٍ ۙ ④

4. దానిలో (ఆ రాత్రిలో), ప్రతి విషయం వివేకంతో విశదీకరించబడుతుంది;

اَمْرًا مِّنْ عِنْدِنَا ۭ اِنَّا كُنَّا مُرْسِلِيْنَ ۚ ⑤

5. మా ఆజ్ఞానుసారంగా. నిశ్చయంగా, మేము (సందేశహరులను) పంపుతూవచ్చాము.

---

1. చూడండి, 12:1.
2. ఖుర్ఆన్ అవతరింపజేయబడిన రాత్రి లైలతుల్ ఖద్ర్ శుభవంతమైన రాత్రి. చూడండి, సూరహ్ అల్-ఖద్ర్ (97). ఇంకా చూడండి, 2:185 ఈ రాత్రి రమ'దాన్ నెల చివరి 10 రోజులలోని బేసి రాత్రులలో ఒకటి అని చాలామంది వ్యాఖ్యాతల అభిప్రాయం. (1) ఈ రాత్రిలో ఖుర్ఆన్ అవతరింపజేయబడింది. (2) ఈ రాత్రిలోనే దైవదూత ('అలైహిమ్ స.)లు మరియు పవిత్ర ఆత్మ (జిబ్రీల్ 'అ.స.) దిగివస్తారు. (3) ఈ రాత్రిలో, రాబోయే సంవత్సరంలో జరుగబోయే విషయాల నిర్ణయం జరుగుతుంది. (4) ఈ రాత్రిలో చేసే ఆరాధన ('ఇబాదహ్) వేయి నెలల (83 సంవత్సరాల 4 నెలల) ఆరాధన కంటే ఉత్తమమైనది. ఈ రాత్రిలోనే ఖుర్ఆన్ ఏడవ ఆకాశంపై ఉన్న లౌ'హె మ'హ్ఫూ''జ్ నుండి భూలోకపు ఆకాశంపై ఉన్న బైతుల్ 'ఇజ్జహ్‌లోకి మొత్తం ఒకేసారి దింపబడింది. ఆ తరువాత 23 సంవత్సరాలలో క్రమక్రమంగా దైవప్రవక్త ('స'అస) మీద అవతరింపజేయబడింది.
3. ఖుర్ఆన్ అవతరణ ప్రజలకు మంచి చెడును బోధించటానికి జరిగింది.

رَحْمَةً مِّن رَّبِّكَ ۚ إِنَّهُۥ هُوَ ٱلسَّمِيعُ ٱلْعَلِيمُ ٦

6. నీ ప్రభువు తరఫునుండి కారుణ్యంగా! నిశ్చయంగా, ఆయనే అంతా వినేవాడు, సర్వజ్ఞుడు.

رَبِّ ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضِ وَمَا بَيْنَهُمَآ ۖ إِن كُنتُم مُّوقِنِينَ ٧

7. భూమ్యాకాశాలకు మరియు వాటి మధ్య ఉన్న సమస్తానికీ ప్రభువు. మీకు వాస్తవంగా నమ్మకమే ఉంటే!

لَآ إِلَٰهَ إِلَّا هُوَ يُحْىِۦ وَيُمِيتُ ۖ رَبُّكُمْ وَرَبُّ ءَابَآئِكُمُ ٱلْأَوَّلِينَ ٨

8. ఆయన తప్ప మరొక ఆరాధ్య దేవుడు లేడు. ఆయనే జీవితాన్ని ప్రసాదించేవాడు మరియు ఆయనే మరణాన్ని ఇచ్చేవాడు. ఆయనే మీ ప్రభువు మరియు పూర్వీకులైన మీ తాతముత్తాతల ప్రభువు.[4]

بَلْ هُمْ فِى شَكٍّ يَلْعَبُونَ ٩

9. అసలు! వారు సందేహంలోపడి ఆటల్లో మునిగిఉన్నారు (పరిహసిస్తున్నారు).

فَٱرْتَقِبْ يَوْمَ تَأْتِى ٱلسَّمَآءُ بِدُخَانٍ مُّبِينٍ ١٠

10. కావున నీవు ఆకాశంనుండి స్పష్టమైన పొగవచ్చే దినం కొరకు నిరీక్షించు!

يَغْشَى ٱلنَّاسَ ۖ هَٰذَا عَذَابٌ أَلِيمٌ ١١

11. అది మానవులందరినీ క్రమ్ముకుంటుంది. అదొక బాధాకరమైన శిక్ష.

رَّبَّنَا ٱكْشِفْ عَنَّا ٱلْعَذَابَ إِنَّا مُؤْمِنُونَ ١٢

12. (అప్పుడు వారు ఇలా వేడుకుంటారు): "ఓ మా ప్రభూ! ఈ శిక్షను మా నుండి తొలగించు. నిశ్చయంగా, మేము విశ్వాసులమవుతాము."

أَنَّىٰ لَهُمُ ٱلذِّكْرَىٰ وَقَدْ جَآءَهُمْ رَسُولٌ مُّبِينٌ ١٣

13. ఇక (అంతిమ ఘడియలో) హితబోధ స్వీకరించటం వారికి ఎలా పనికి రాగలదు? వాస్తవానికి వారివద్దకు (సత్యాన్ని) స్పష్టంగా తెలియజేసే ప్రవక్త వచ్చి ఉన్నాడు;

ثُمَّ تَوَلَّوْا۟ عَنْهُ وَقَالُوا۟ مُعَلَّمٌ مَّجْنُونٌ ١٤

14. అప్పుడు వారు అతని నుండి మరలి పోయారు మరియు ఇలా అన్నారు: "ఇతను ఇతరుల నుండి నేర్చుకున్నాడు, ఇతనొక పిచ్చివాడు!"[5]

---

4. చూడండి, **7:158**. ఈ ఆయత్‌ను పోలిన ఆయత్.

5. చూడండి, **16:103** మరియు **25:4**.

إِنَّا كَاشِفُوا الْعَذَابِ قَلِيلًا إِنَّكُمْ عَائِدُونَ ﴿١٥﴾

15. వాస్తవానికి మేము కొంతకాలం వరకు ఈ శిక్షను తొలగిస్తే నిశ్చయంగా, మీరు చేస్తూవచ్చిందే మళ్ళీచేస్తారు.

يَوْمَ نَبْطِشُ الْبَطْشَةَ الْكُبْرَىٰ إِنَّا مُنْتَقِمُونَ ﴿١٦﴾

16. మేము శిక్షించటం కోసం గట్టిగా పట్టుకున్న రోజు, మేము నిశ్చయంగా, ప్రతీకారం చేస్తాము. (3/4)

وَلَقَدْ فَتَنَّا قَبْلَهُمْ قَوْمَ فِرْعَوْنَ وَجَاءَهُمْ رَسُولٌ كَرِيمٌ ﴿١٧﴾

17. * మరియు వాస్తవంగా, వారికి పూర్వం మేము ఫిర్'ఔన్ జాతివారిని పరీక్షకు గురిచేశాము. మరియు వారివద్దకు గౌరవ నీయుడైన ప్రవక్త వచ్చి ఉన్నాడు.

أَنْ أَدُّوا إِلَيَّ عِبَادَ اللَّهِ إِنِّي لَكُمْ رَسُولٌ أَمِينٌ ﴿١٨﴾

18. (అతను ఇలా అన్నాడు): "అల్లాహ్ దాసులను నాకు అప్పగించు.[6] నేను మీ వద్దకు పంపబడిన నమ్మకస్తుణ్ణయిన సందేశహరుణ్ణి.

وَأَنْ لَا تَعْلُوا عَلَى اللَّهِ إِنِّي آتِيكُمْ بِسُلْطَانٍ مُبِينٍ ﴿١٩﴾

19. "మరియు మీరు అల్లాహ్ ముందు అహంభావాన్ని (ఔన్నత్యాన్ని) చూపకండి. నిశ్చయంగా, నేను మీ వద్దకు స్పష్టమైన ప్రమాణం తీసుకొనివచ్చాను.

وَإِنِّي عُذْتُ بِرَبِّي وَرَبِّكُمْ أَنْ تَرْجُمُونِ ﴿٢٠﴾

20. "మరియు నిశ్చయంగా, నేను నా ప్రభువు మరియు మీ ప్రభువు (అయిన అల్లాహ్) యొక్క శరణు పొందాను మీరు నన్ను రాళ్ళురువ్వి చంపకుండా ఉండటానికి!

وَإِنْ لَمْ تُؤْمِنُوا لِي فَاعْتَزِلُونِ ﴿٢١﴾

21. "ఒకవేళ మీరు నా మాట నమ్మక పోయినా సరే! నాజోలికి మాత్రం రాకండి!"

فَدَعَا رَبَّهُ أَنَّ هَٰؤُلَاءِ قَوْمٌ مُجْرِمُونَ ﴿٢٢﴾

22. చివరకు అతను తన ప్రభువును ఇలా ప్రార్థించాడు: "నిశ్చయంగా, ఈ జనులు చాలా అపరాధులు!"

فَأَسْرِ بِعِبَادِي لَيْلًا إِنَّكُمْ مُتَّبَعُونَ ﴿٢٣﴾

23. (అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు): "నీవు నా దాసులను తీసుకొని రాత్రివేళ బయలుదేరు, నిశ్చయంగా మీరు వెంబడించబడతారు.

---

6. 'ఇబాదల్లాహ్: అంటే ఇక్కడ మూసా ('అ.స.) జాతివారైన బనీ ఇస్రాయీ'ల్ తెగవారు.

24. ``మరియు సముద్రాన్ని చీల్చి నెమ్మదిగా వెళ్ళిపో.[7] నిశ్చయంగా, ఆ సైనికులు అందులో మునిగిపోతారు!''

وَاتْرُكِ الْبَحْرَ رَهْوًا ۭ اِنَّهُمْ جُنْدٌ مُّغْرَقُوْنَ ۝٢٤

25. వారు ఎన్నో తోటలను మరియు చెలమలను వెనుక విడిచిపోయారు;

كَمْ تَرَكُوْا مِنْ جَنّٰتٍ وَّعُيُوْنٍ ۝٢٥

26. మరియు ఎన్నో పంటపొలాలను మరియు గొప్ప భవనాలను;

وَّزُرُوْعٍ وَّمَقَامٍ كَرِيْمٍ ۝٢٦

27. మరియు వారు అనుభవిస్తూ ఉన్న ఎన్నో సుఖసంతోషాలను కూడా!

وَّنَعْمَةٍ كَانُوْا فِيْهَا فٰكِهِيْنَ ۝٢٧

28. ఈ విధంగా, (వారి ముగింపు జరిగింది). మరియు మేము వాటికి ఇతర జాతివారిని వారసులుగా చేశాము.

كَذٰلِكَ ۣ وَاَوْرَثْنٰهَا قَوْمًا اٰخَرِيْنَ ۝٢٨

29. కాని, వారికొరకు ఆకాశం గానీ, భూమి గానీ విలపించలేదు మరియు వారికి ఎలాంటి వ్యవధి కూడా ఇవ్వబడలేదు.

فَمَا بَكَتْ عَلَيْهِمُ السَّمَاۗءُ وَالْاَرْضُ وَمَا كَانُوْا مُنْظَرِيْنَ ۝٢٩

30. మరియు వాస్తవంగా! మేము ఇస్రాయీ'ల్ సంతతివారిని అవమానకరమైన శిక్షనుండి విముక్తి కలిగించాము -

وَلَقَدْ نَجَّيْنَا بَنِيْٓ اِسْرَاۗءِيْلَ مِنَ الْعَذَابِ الْمُهِيْنِ ۝٣٠

31. ఫిర్'ఔన్ నుండి. నిశ్చయంగా అతడు మితిమీరి ప్రవర్తించేవారిలో, అగ్రగణ్యుడు.

مِنْ فِرْعَوْنَ ۭ اِنَّهٗ كَانَ عَالِيًا مِّنَ الْمُسْرِفِيْنَ ۝٣١

32. మరియు వాస్తవానికి మాకు తెలిసి ఉండి కూడా మేము వారిని లోకంలో (ఆ కాలపు) సర్వజనులపై ఎన్నుకున్నాము.[8]

وَلَقَدِ اخْتَرْنٰهُمْ عَلٰي عِلْمٍ عَلَي الْعٰلَمِيْنَ ۝٣٢

33. మరియు మేము వారికి అద్భుత సూచనలను (ఆయాత్‌లను) ఒసంగిఉంటిమి. అందులో వారికి స్పష్టమైన పరీక్షఉండింది.

وَاٰتَيْنٰهُمْ مِّنَ الْاٰيٰتِ مَا فِيْهِ بَلٰۗـؤٌا مُّبِيْنٌ ۝٣٣

---

7. చూడండి, **26:63-66**. *రహ్వాన్:* అంటే ప్రశాంతమైనది లేక తడిలేనిది. జౌహరీ (ర'హ్మ) దీనిని ప్రశాంతంగా చీలిపోయి ఉన్నది, అని వివరించారు.

8. ఎందుకంటే ఆ కాలంలో కేవలం బనీ ఇస్రాయీ'ల్ వారు మాత్రమే ఏకైక ఆరాధ్యుడు అల్లాహ్ (సు.తా.)ను ప్రార్థించేవారు. మిగతా వారంతా బహుదైవారాధకులుగా ఉన్నారు.

إِنَّ هَٰٓؤُلَآءِ لَيَقُولُونَ ﴿٣٤﴾

34. నిశ్చయంగా, వీరు (ఖురైషులు) ఇలా అంటున్నారు:

إِنْ هِىَ إِلَّا مَوْتَتُنَا ٱلْأُولَىٰ وَمَا نَحْنُ بِمُنشَرِينَ ﴿٣٥﴾

35. "వాస్తవానికి, మాకు ఈ మొదటి మరణం మాత్రమే ఉంది, ఆ తరువాత మేము తిరిగి బ్రతికించబడము.

فَأْتُوا۟ بِـَٔابَآئِنَآ إِن كُنتُمْ صَٰدِقِينَ ﴿٣٦﴾

36. "మీరు సత్యవంతులే అయితే, మా తాతముత్తాతలను లేపి తీసుకురండి!"[9]

أَهُمْ خَيْرٌ أَمْ قَوْمُ تُبَّعٍ وَٱلَّذِينَ مِن قَبْلِهِمْ ۚ أَهْلَكْنَٰهُمْ ۖ إِنَّهُمْ كَانُوا۟ مُجْرِمِينَ ﴿٣٧﴾

37. వారు మేలైన వారా? లేక తుబ్బ'అ జాతివారు[10] మరియు వారికంటే పూర్వం వారా? మేము వారందరినీ నాశనంచేశాము. నిశ్చయంగా, వారందరూ అపరాధులే!

وَمَا خَلَقْنَا ٱلسَّمَٰوَٰتِ وَٱلْأَرْضَ وَمَا بَيْنَهُمَا لَٰعِبِينَ ﴿٣٨﴾

38. మేము ఈ ఆకాశాలను మరియు భూమిని మరియు వాటి మధ్య నున్న సమస్తాన్నీ ఆట (కాలక్షేపం) కొరకు సృష్టించలేదు.[11]

مَا خَلَقْنَٰهُمَآ إِلَّا بِٱلْحَقِّ وَلَٰكِنَّ أَكْثَرَهُمْ لَا يَعْلَمُونَ ﴿٣٩﴾

39. మేము వాటిని ఒక లక్ష్యంతోనే సృష్టించాము, కాని చాలా మందికి ఇది తెలియదు.[12]

إِنَّ يَوْمَ ٱلْفَصْلِ مِيقَٰتُهُمْ أَجْمَعِينَ ﴿٤٠﴾

40. నిశ్చయంగా, తీర్పుదినం వారందరి కొరకు ఒక నిర్ణీతదినం.[13]

يَوْمَ لَا يُغْنِى مَوْلًى عَن مَّوْلًى شَيْـًٔا وَلَا هُمْ يُنصَرُونَ ﴿٤١﴾

41. ఆ దినమున ఏ స్నేహితుడు కూడా మరొక స్నేహితునికి ఏ మాత్రం ఉపయోగపడడు. మరియు వారికి ఎలాంటి సహాయమూ లభించదు[14]

---

9. చూడండి, **43:22-23**.

10. తుబ్బ'అ అంటే సబా' ప్రాంతంలో నివసించే 'హిమ్'యార్ తెగకు చెందినవారు. వారి రాజుల బిరుదు తుబ్బ'అ. ఏవిధంగానైతే రోమన్ రాజులు సీజర్ అనబడేవారో! వారు చాలా కాలం దక్షిణ 'అరేబియా మీద రాజరికంచేశారు. వారిని, అబిసీనియా వారు (Abyssinians) 4వ క్రీ.శ.లో అంతమొందించారు. చూడండి, **50:14** వారు సత్యతిరస్కారులు.

11. ఇటువంటి ఆయత్ కోసం చూడండి, **38:27, 23:115-116, 15:85** మరియు **21:16**.

12. చూడండి, **10:5**.

13. చూడండి, **77:13**.

14. చూడండి, **23:101, 70:10**. మౌలా: అంటే కొందరు, "దగ్గరి బంధువు," అని కూడా తాత్పర్యమిచ్చారు.

إِلَّا مَن رَّحِمَ ٱللَّهُ ۚ إِنَّهُۥ هُوَ ٱلْعَزِيزُ ٱلرَّحِيمُ ﴿٤٢﴾

42. అల్లాహ్ కరుణించిన వానికి తప్ప! నిశ్చయంగా, ఆయనే సర్వశక్తిమంతుడు, అపార కరుణాప్రదాత.

إِنَّ شَجَرَتَ ٱلزَّقُّومِ ﴿٤٣﴾

43. నిశ్చయంగా, జఖ్ఖూమ్ వృక్షఫలం;

طَعَامُ ٱلْأَثِيمِ ﴿٤٤﴾

44. పాపులకు అహారంగా ఇవ్వబడుతుంది;

كَٱلْمُهْلِ ۛ يَغْلِى فِى ٱلْبُطُونِ ﴿٤٥﴾

45. మరిగే నూనె (సీసం) వలే,[15] అది వారి కడుపులో మరుగుతుంది,

كَغَلْىِ ٱلْحَمِيمِ ﴿٤٦﴾

46. సలసల కాగే నీటి లాగా!

خُذُوهُ فَٱعْتِلُوهُ إِلَىٰ سَوَآءِ ٱلْجَحِيمِ ﴿٤٧﴾

47. (ఇలా అనబడుతుంది): "ఇతనిని పట్టుకొని భగభగ మండే నరకాగ్ని మధ్యలోకి ఈడ్వండి,

ثُمَّ صُبُّوا۟ فَوْقَ رَأْسِهِۦ مِنْ عَذَابِ ٱلْحَمِيمِ ﴿٤٨﴾

48. "ఆ తరువాత అతని నెత్తిమీద సలసల కాగే నీటి శిక్షను పోయండి.

ذُقْ إِنَّكَ أَنتَ ٱلْعَزِيزُ ٱلْكَرِيمُ ﴿٤٩﴾

49. " 'దీనిని రుచిచూడు; నిశ్చయంగా, నీవు శక్తిమంతుడివిగా, గౌరవనీయుడివిగా ఉండేవాడివి కదా!'

إِنَّ هَٰذَا مَا كُنتُم بِهِۦ تَمْتَرُونَ ﴿٥٠﴾

50. "నిశ్చయంగా, ఇదే మీరు సందేహంలో పడివున్న విషయం!"

إِنَّ ٱلْمُتَّقِينَ فِى مَقَامٍ أَمِينٍ ﴿٥١﴾

51. నిశ్చయంగా, దైవభీతి గలవారు శాంతి భద్రతలుగల స్థలంలో ఉంటారు.

فِى جَنَّٰتٍ وَعُيُونٍ ﴿٥٢﴾

52. ఉద్యానవనాలలో మరియు చెలమల మధ్య.

يَلْبَسُونَ مِن سُندُسٍ وَإِسْتَبْرَقٍ مُّتَقَٰبِلِينَ ﴿٥٣﴾

53. వారు, మృదువైన పట్టు వస్త్రాలు మరియు బంగారు (జరీ) పట్టు వస్త్రాలు ధరించి, ఒకరికొకరు ఎదురెదురుగా కూర్చొని ఉంటారు.[16]

---

15. అల్-ముహ్లు: కరిగిన రాగి అని కూడా కొందరు వ్యాఖ్యానించారు.

16. చూడండి, **18:31** మరియు **35:33**.

كَذٰلِكَ وَزَوَّجْنٰهُمْ بِحُوْرٍ عِيْنٍ ﴿٥٤﴾

54. ఇలా ఉంటుంది వారిస్థితి! మరియు మేము వారిని అందమైన, ప్రకాశవంతమైన కళ్ళుగల వారితో ('హూర్‌లతో) వివాహం చేయిస్తాము.[17]

يَدْعُوْنَ فِيْهَا بِكُلِّ فَاكِهَةٍ اٰمِنِيْنَ ﴿٥٥﴾

55. వారక్కడ శాంతియుతంగా ఉంటూ అనేకరకాలైన ఫలాలను అడుగుతుంటారు.[18]

لَا يَذُوْقُوْنَ فِيْهَا الْمَوْتَ اِلَّا الْمَوْتَةَ الْاُوْلٰى ۚ وَوَقٰهُمْ عَذَابَ الْجَحِيْمِ ﴿٥٦﴾

56. వారక్కడ మరణాన్ని[19] ఎన్నడూ రుచి చూడరు; వారి మొదటి (ఇహలోక) మరణం తప్ప! మరియు ఆయన వారిని భగభగ మండే అగ్నిశిక్ష నుండి కాపాడాడు;

فَضْلًا مِّنْ رَّبِّكَ ۚ ذٰلِكَ هُوَ الْفَوْزُ الْعَظِيْمُ ﴿٥٧﴾

57. నీ ప్రభువు అనుగ్రహం వల్ల. ఇదే, ఆ గొప్ప సాఫల్యం!

فَاِنَّمَا يَسَّرْنٰهُ بِلِسَانِكَ لَعَلَّهُمْ يَتَذَكَّرُوْنَ ﴿٥٨﴾

58. అందుకే నిశ్చయంగా, మేము (ఈ ఖుర్‌ఆన్‌ను) నీ భాషలో సులభం చేశాము. ఇలాగైనా వారు అర్థం చేసుకుంటారని (హితబోధ గ్రహిస్తారని).[20]

فَارْتَقِبْ اِنَّهُمْ مُّرْتَقِبُوْنَ ﴿٥٩﴾

59. కావున, నీవు నిరీక్షించు! నిశ్చయంగా వారు కూడా నిరీక్షిస్తున్నారు.

*****

---

17. 'హూరున్: చూడండి, **56:22**, **52:20**, **55:56**, **37:48**,**38:52**. వారి కళ్ళనలుపు మరియు తెలుపు ఎంతో అందంగా ఉంటాయి. వారిని చూసినవారు వారి అందానికి ముగ్ధులైపోతారు.

18. చూడండి, **43:73**.

19. 'స'హీ'హ్ 'హదీస్'లో ఉంది: మృత్యువును ఒక గొర్రె ఆకారంలో తెచ్చి స్వర్గనరకాల మధ్య జిబ్హ్ చేస్తారు. మరియు ఈ విధంగా ప్రకటిస్తారు: 'ఓ స్వర్గ వాసులారా! ఇక మీకు మృత్యువు లేదు; మీరు కలకాలం స్వర్గంలో ఉంటారు. ఓ నరక వాసులారా! మీకు సదా నరకవాసమే. మీకు మృత్యువు లేదు.' ('స.బు'ఖారీ, ముస్లిం) ఇంకా చూడండి, **19:39**, **37:58-59**.

20. చూడండి, **19:97**.

***

45. సూరహ్ అల్-జాసి'యహ్

سُورَةُ الجَاثِيَةِ

జాసి'యతున్: భక్తితో మోకరిల్లటం, కూలబడటం ఇది సూరహ్ అద్-'దుఖాన్ (44) తరువాత అవతరింపజేయబడింది. దీని పేరు 28వ ఆయత్‌లో వచ్చింది. మానవులంతా పునరుత్థాన దినమున నమ్రతతో అల్లాహ్‌ముందు మోకరిల్లుతారు. 'హా మీమ్, సూరాహ్‌లలో ఇది ఆరవది. మక్కాలో అవతరింపజేయబడిన ఈ సూరహ్‌లో 37 ఆయతులు ఉన్నాయి.

بِسۡمِ ٱللَّهِ ٱلرَّحۡمَٰنِ ٱلرَّحِيمِ

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

حمٓ ١

1. 'హా-మీమ్.

تَنزِيلُ ٱلۡكِتَٰبِ مِنَ ٱللَّهِ ٱلۡعَزِيزِ ٱلۡحَكِيمِ ٢

2. ఈ గ్రంథ (ఖుర్ఆన్) అవతరణ సర్వ శక్తిమంతుడు, మహా వివేకవంతుడైన అల్లాహ్ తరఫునుండి జరిగింది.

إِنَّ فِي ٱلسَّمَٰوَٰتِ وَٱلۡأَرۡضِ لَأٓيَٰتٖ لِّلۡمُؤۡمِنِينَ ٣

3. నిశ్చయంగా, విశ్వసించే వారి కొరకు, ఆకాశాలలో మరియు భూమిలో అనేక సూచనలు (ఆయాత్) ఉన్నాయి.[1]

وَفِي خَلۡقِكُمۡ وَمَا يَبُثُّ مِن دَآبَّةٍ ءَايَٰتٞ لِّقَوۡمٖ يُوقِنُونَ ٤

4. మరియు మీ సృష్టిలోనూ మరియు (భూమిలో) ఆయన వ్యాపింపజేసిన జీవరాసుల లోనూ, దృఢవిశ్వాసమున్న వారి కొరకు ఎన్నో సూచనలు (ఆయాత్) ఉన్నాయి.[2]

وَٱخۡتِلَٰفِ ٱلَّيۡلِ وَٱلنَّهَارِ وَمَآ أَنزَلَ ٱللَّهُ مِنَ ٱلسَّمَآءِ مِن رِّزۡقٖ فَأَحۡيَا بِهِ ٱلۡأَرۡضَ بَعۡدَ مَوۡتِهَا وَتَصۡرِيفِ ٱلرِّيَٰحِ ءَايَٰتٞ لِّقَوۡمٖ يَعۡقِلُونَ ٥

5. మరియు రేయింబవళ్ళ అనుక్రమంలో మరియు అల్లాహ్ ఆకాశం నుండి జీవనోపాధిని (వర్షాన్ని) పంపి, దాని ద్వారా భూమికి దాని మరణం తర్వాత తిరిగి జీవం పోయటంలో మరియు వాయువుల మారటంలోనూ బుద్ధిమంతులకు ఎన్నో సూచనలు ఉన్నాయి.

تِلۡكَ ءَايَٰتُ ٱللَّهِ نَتۡلُوهَا عَلَيۡكَ بِٱلۡحَقِّۖ فَبِأَيِّ حَدِيثِۭ بَعۡدَ ٱللَّهِ وَءَايَٰتِهِۦ يُؤۡمِنُونَ ٦

6. ఇవి అల్లాహ్ సూచనలు (ఆయాత్), మేము వీటిని నీకు యథాతథంగా వినిపిస్తున్నాము. ఇక వారు అల్లాహ్‌ను మరియు ఆయన సూచనలను (ఆయాత్‌లను) కాక మరే సమాచారాన్ని విశ్వసిస్తారు?[3]

---

1. చూడండి, 2:164.
2. చూడండి, 7:185 మరియు 10:5.
3. చూడండి, 39:23.

وَيْلٌ لِّكُلِّ أَفَّاكٍ أَثِيمٍ ﴿٧﴾

7. అపవాదుడు, పాపిష్ఠుడు అయిన ప్రతివ్యక్తికి తీవ్రమైన వ్యథ గలదు.

يَسْمَعُ آيَاتِ اللَّهِ تُتْلَىٰ عَلَيْهِ ثُمَّ يُصِرُّ مُسْتَكْبِرًا كَأَن لَّمْ يَسْمَعْهَا ۖ فَبَشِّرْهُ بِعَذَابٍ أَلِيمٍ ﴿٨﴾

8. అతడు తన ముందు పఠించబడే అల్లాహ్ సూచనలను (ఆయాత్‌లను) వింటున్నాడు ఆ తరువాతమూర్ఖపుపట్టుతోదురహంకారంతోవాటిని విననట్లువ్యవహరిస్తున్నాడు.కావునఅతనికి బాధాకరమైన శిక్ష పడనున్నదనే వార్తను వినిపించు.

وَإِذَا عَلِمَ مِنْ آيَاتِنَا شَيْئًا اتَّخَذَهَا هُزُوًا ۚ أُولَٰئِكَ لَهُمْ عَذَابٌ مُّهِينٌ ﴿٩﴾

9. మరియు మా సూచనలకు (ఆయాత్‌లకు) సంబంధించిన విషయం అతనికి తెలిసినప్పుడు, వాటినిగురించి ఎగతాళిచేస్తాడు. అటువంటి వారందరికీ అవమాన కరమైన శిక్ష ఉంది.

مِّن وَرَائِهِمْ جَهَنَّمُ ۖ وَلَا يُغْنِي عَنْهُم مَّا كَسَبُوا شَيْئًا وَلَا مَا اتَّخَذُوا مِن دُونِ اللَّهِ أَوْلِيَاءَ ۖ وَلَهُمْ عَذَابٌ عَظِيمٌ ﴿١٠﴾

10. వారి ముందు నరకముంటుంది. మరియు వారి సంపాదన వారికి ఏమాత్రం పనికిరాదు. మరియు అల్లాహ్‌ను వదలి వారు సంరక్షకులుగా చేసుకున్న వారుకూడా వారికి ఏవిధంగానూ ఉపయోగపడరు. మరియు వారికి ఘోరమైన శిక్ష ఉంటుంది.

هَٰذَا هُدًى ۖ وَالَّذِينَ كَفَرُوا بِآيَاتِ رَبِّهِمْ لَهُمْ عَذَابٌ مِّن رِّجْزٍ أَلِيمٌ ﴿١١﴾

11. ఇది (ఈ ఖుర్‌ఆన్) మార్గదర్శకత్వం. మరియు ఎవరైతే తమ ప్రభువు సూచనలను (ఆయాత్‌లను) తిరస్కరిస్తారో, వారికి అధమమైన, బాధాకరమైన శిక్ష ఉంది.[4] **(7/8)**

اللَّهُ الَّذِي سَخَّرَ لَكُمُ الْبَحْرَ لِتَجْرِيَ الْفُلْكُ فِيهِ بِأَمْرِهِ وَلِتَبْتَغُوا مِن فَضْلِهِ وَلَعَلَّكُمْ تَشْكُرُونَ ﴿١٢﴾

12. * అల్లాహ్! ఆయనే, సముద్రాన్ని మీకు ఉపయుక్తంగా చేశాడు; దానిలో తన ఆజ్ఞతో ఓడలు పయనించటానికి మరియు మీరు ఆయన అనుగ్రహాన్ని అన్వేషించటానికి మరియు బహుశా మీరు కృతజ్ఞులవుతారని.

وَسَخَّرَ لَكُم مَّا فِي السَّمَاوَاتِ وَمَا فِي الْأَرْضِ جَمِيعًا مِّنْهُ ۚ إِنَّ فِي ذَٰلِكَ لَآيَاتٍ لِّقَوْمٍ يَتَفَكَّرُونَ ﴿١٣﴾

13. మరియు ఆయన ఆకాశాలలో మరియు భూమిలో నున్న సమస్తాన్ని, తన అనుగ్రహంతో మీకు ఉపయుక్తంగా చేశాడు. నిశ్చయంగా,

---

4. చూడండి, 34:5.

ఇందులో ఆలోచించే వారికి ఎన్నో సూచనలు (ఆయాత్) ఉన్నాయి.

14. (ఓ ప్రవక్తా!) విశ్వసించిన వారితో: " 'ఒక జాతి వారికి తమ కర్మలకు తగిన ప్రతిఫలమిచ్చే అల్లాహ్ దినాలు[5] వస్తాయని' నమ్మని వారిని క్షమించండి." అని చెప్పు.[6]

قُلْ لِّلَّذِيْنَ اٰمَنُوْا يَغْفِرُوْا لِلَّذِيْنَ لَا يَرْجُوْنَ اَيَّامَ اللّٰهِ
لِيَجْزِيَ قَوْمًاۢ بِمَا كَانُوْا يَكْسِبُوْنَ ﴿١٤﴾

15. సత్కార్యం చేసేవాడు తన మేలుకే చేస్తాడు. మరియు దుష్కార్యం చేసేవాడు దాని (ఫలితాన్ని) అనుభవిస్తాడు. చివరకు మీరంతా మీ ప్రభువు వైపునకే మరలింపబడతారు.

مَنْ عَمِلَ صَالِحًا فَلِنَفْسِهٖ ۚ وَمَنْ اَسَآءَ فَعَلَيْهَا ۚ
ثُمَّ اِلٰى رَبِّكُمْ تُرْجَعُوْنَ ﴿١٥﴾

16. మరియు వాస్తవంగా, మేము ఇస్రాయీ'ల్ సంతతి వారికి గ్రంథాన్ని (తౌరాత్‌ను), వివేకాన్ని మరియు ప్రవక్త పదవులను ప్రసాదించి ఉన్నాము మరియు వారికి మంచి జీవనోపాధిని ప్రసాదించి ఉన్నాము మరియు వారిని (వారి కాలపు) ప్రజలపై ప్రత్యేకంగా ఆదరించి ఉన్నాము.[7]

وَلَقَدْ اٰتَيْنَا بَنِيْٓ اِسْرَآءِيْلَ الْكِتٰبَ وَالْحُكْمَ وَالنُّبُوَّةَ
وَرَزَقْنٰهُمْ مِّنَ الطَّيِّبٰتِ وَفَضَّلْنٰهُمْ عَلَى الْعٰلَمِيْنَ ﴿١٦﴾

17. మరియు వారికి ధర్మ విషయంలో స్పష్టమైన నిదర్శనాలు ఇచ్చిఉన్నాము.[8] వారు తమ పరస్పర ద్వేషాల వల్ల వారికి జ్ఞానం వచ్చిన పిదపనే విభేదాలకు లోనయ్యారు.[9] నిశ్చయంగా, నీ ప్రభువు వారి మధ్య ఉన్న విభేదాలను గురించి పునరుత్థాన దినమున, వారి మధ్య తీర్పుచేస్తాడు.

وَاٰتَيْنٰهُمْ بَيِّنٰتٍ مِّنَ الْاَمْرِ ۚ فَمَا اخْتَلَفُوْٓا اِلَّا مِنْۢ بَعْدِ
مَا جَآءَهُمُ الْعِلْمُ ۙ بَغْيًاۢ بَيْنَهُمْ ۗ اِنَّ رَبَّكَ
يَقْضِيْ بَيْنَهُمْ يَوْمَ الْقِيٰمَةِ فِيْمَا كَانُوْا فِيْهِ
يَخْتَلِفُوْنَ ﴿١٧﴾

---

5. అయ్యామల్లాహ్: అల్లాహ్ దినాలు, అంటే పునరుత్థానదినం. చూడండి, **14:5**.

6. ఈ ఆజ్ఞ ప్రవక్తృత్వం ప్రసాదించబడిన మొదటి రోజులలోఉండేది. అప్పుడు ముస్లింలు, కొంతమంది మాత్రమే ఉండేవారు. మరియు వారిలో చాలామంది సమాజంలో బలహీన వర్గాలకు చెందినవారు. ఎప్పుడైతే ముస్లింలు తమ శత్రువులను ఎదుర్కొనే స్థితికి వచ్చారో వారికి జిహాద్ ఆజ్ఞ ఇవ్వబడింది.

7. ఆ కాలంలో బనీ ఇస్రాయీ'ల్ వారు మాత్రమే, ఏకదైవారాధకులుండిరి. చూడండి, **2:47**.

8. అల్-అమ్రు: ఇక్కడ చాలా వ్యాఖ్యాతల దృష్టిలో 'ధర్మం' కొరకు వాడబడింది.

9. చూడండి, **23:53**.

18. తరువాత (ఓ ము'హమ్మద్!) మేము, నిన్ను, (మేము) నియమించిన ధర్మవిధానం మీద ఉంచాము. కావున నీవు దానినే అనుసరించు మరియు నీవు జ్ఞానంలేని వారి కోరికలను అనుసరించకు.

ثُمَّ جَعَلْنٰكَ عَلٰى شَرِيْعَةٍ مِّنَ الْاَمْرِ فَاتَّبِعْهَا وَلَا تَتَّبِعْ اَهْوَآءَ الَّذِيْنَ لَا يَعْلَمُوْنَ ۝١٨

19. నిశ్చయంగా వారు, నీకు - అల్లాహ్‌కు ప్రతిగా - ఏ మాత్రం ఉపయోగ పడలేరు. మరియు నిశ్చయంగా దుర్మార్గులు ఒకరికొకరు రక్షకులు. మరియు అల్లాహ్‌యే దైవభీతి గలవారి సంరక్షకుడు.

اِنَّهُمْ لَنْ يُّغْنُوْا عَنْكَ مِنَ اللّٰهِ شَيْـًٔا ۭ وَاِنَّ الظّٰلِمِيْنَ بَعْضُهُمْ اَوْلِيَآءُ بَعْضٍ ۚ وَاللّٰهُ وَلِيُّ الْمُتَّقِيْنَ ۝١٩

20. ఇది (ఈ ఖుర్ఆన్) మానవులకు అంతర్దృష్టి (పరిజ్ఞానం) ఇచ్చేదిగానూ మరియు విశ్వసించే జనులకు మార్గదర్శకత్వం గానూ మరియు కారుణ్యం గానూ ఉంది.

هٰذَا بَصَآئِرُ لِلنَّاسِ وَهُدًى وَّرَحْمَةٌ لِّقَوْمٍ يُّوْقِنُوْنَ ۝٢٠

21. దుష్కార్యాలకు పాల్పడినవారు, వారి ఇహలోక జీవితంలోనూ మరియు వారి మరణాంతర జీవితంలోనూ - వారినీ మరియు విశ్వసించి సత్కార్యాలు చేసే వారినీ - మేము ఒకే విధంగా పరిగణిస్తామని భావిస్తున్నారా ఏమిటి? వారి నిర్ణయాలు ఎంత చెడ్డవి!

اَمْ حَسِبَ الَّذِيْنَ اجْتَرَحُوا السَّيِّاٰتِ اَنْ نَّجْعَلَهُمْ كَالَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ ۙ سَوَآءً مَّحْيَاهُمْ وَمَمَاتُهُمْ ۭ سَآءَ مَا يَحْكُمُوْنَ ۝٢١

22. మరియు అల్లాహ్ ఆకాశాలనూ మరియు భూమినీ సత్యంతో సృష్టించాడు మరియు ప్రతివ్యక్తికి తన కర్మలకు తగిన ప్రతిఫలమివ్వటానికి మరియు వారికి ఎలాంటి అన్యాయం జరుగదు.

وَخَلَقَ اللّٰهُ السَّمٰوٰتِ وَالْاَرْضَ بِالْحَقِّ وَلِتُجْزٰى كُلُّ نَفْسٍۢ بِمَا كَسَبَتْ وَهُمْ لَا يُظْلَمُوْنَ ۝٢٢

23. తన మనోవాంఛలను తన దైవంగా చేసుకున్న వానిని నీవు చూశావా? మరియు అతడు జ్ఞానవంతుడు అయినప్పటికీ, అల్లాహ్! అతనిని మార్గభ్రష్టత్వంలో వదిలాడు[10] మరియు అతని చెవులమీద మరియు అతని హృదయం మీద ముద్రవేశాడు మరియు

اَفَرَءَيْتَ مَنِ اتَّخَذَ اِلٰهَهٗ هَوٰىهُ وَاَضَلَّهُ اللّٰهُ عَلٰى عِلْمٍ وَّخَتَمَ عَلٰى سَمْعِهٖ وَقَلْبِهٖ وَجَعَلَ عَلٰى بَصَرِهٖ غِشٰوَةً ۭ فَمَنْ يَّهْدِيْهِ مِنْۢ بَعْدِ اللّٰهِ ۭ اَفَلَا تَذَكَّرُوْنَ ۝٢٣

---

10. చూడండి, 14:4.

అతని కళ్ళమీద తెరవేశాడు;[11] ఇక అల్లాహ్ తప్ప అతనికి మార్గదర్శకత్వం చేసేవాడెవడున్నాడు? ఇది మీరు గ్రహించలేరా?

وَقَالُوا مَا هِيَ إِلَّا حَيَاتُنَا الدُّنْيَا نَمُوتُ وَنَحْيَا وَمَا يُهْلِكُنَا إِلَّا الدَّهْرُ ۚ وَمَا لَهُم بِذَٰلِكَ مِنْ عِلْمٍ ۖ إِنْ هُمْ إِلَّا يَظُنُّونَ ﴿٢٤﴾

24. మరియు వారిలా అంటారు: "మా (జీవితం) కేవలం ఈ ప్రాపంచిక జీవితం మాత్రమే! మేము మరణించేది మరియు జీవించేది ఇక్కడే మరియు మమ్మల్ని నశింపజేసేది ఈ కాలచక్రం మాత్రమే!"[12] మరియు వాస్తవానికి, దానిని గురించి వారికి ఎలాంటి జ్ఞానం లేదు. వారు కేవలం ఊహాగానాలే చేస్తున్నారు.

وَإِذَا تُتْلَىٰ عَلَيْهِمْ آيَاتُنَا بَيِّنَاتٍ مَّا كَانَ حُجَّتَهُمْ إِلَّا أَن قَالُوا ائْتُوا بِآبَائِنَا إِن كُنتُمْ صَادِقِينَ ﴿٢٥﴾

25. మరియు వారి ముందు స్పష్టమైన మా సూచనలు (ఆయాత్) వినిపించబడినప్పుడు: "మీరు సత్యవంతులే అయితే మా తాతముత్తాతలను (బ్రతికించి) తీసుకురండి!" అని మాత్రమే వాదిస్తారు.[13]

قُلِ اللَّهُ يُحْيِيكُمْ ثُمَّ يُمِيتُكُمْ ثُمَّ يَجْمَعُكُمْ إِلَىٰ يَوْمِ الْقِيَامَةِ لَا رَيْبَ فِيهِ وَلَٰكِنَّ أَكْثَرَ النَّاسِ لَا يَعْلَمُونَ ﴿٢٦﴾

26. వారితో ఇలా అను: "అల్లాహ్‌యే మీకు జీవితం ఇచ్చేవాడు తరువాత మరణింపజేసేవాడు, ఆ పిదప పునరుత్థాన దినమున సమావేశపరచేవాడూను! ఇందులో ఎలాంటి సందేహం లేదు. అయినా చాలామంది జనులకు ఇది తెలియదు."

---

11. చూడండి, 2:7 మరియు 7:186.

12. హదీస్' ఖుద్సీ, అల్లాహ్ (సు.తా.) అంటాడు: "ఆదమ్ కుమారుడు నాకు బాధకలిగిస్తాడు కాలాన్ని దూషిస్తాడు (అంటే కాలం వల్ల తనకు దురవస్థ వచ్చిందంటాడు). వాస్తవానికి కాలం అనేది ఏమీ లేదు. నేనే కాలాన్ని! సర్వాధికారాలు నా చేతిలోనే ఉన్నాయి. రాత్రింబవళ్ళనూ మార్చేవాడను నేనే."(స. బు'ఖారీ, ముస్లిం).

13. చూడండి, 44:36.

27. మరియు ఆకాశాల మరియు భూమి యొక్క సామ్రాజ్యాధిపత్యం కేవలం అల్లాహ్‌కే చెందినది. మరియు ఆ ఘడియ ఆసన్నమైన నాడు, ఆ దినమున అసత్యవాదులు నష్టానికి గురిఅవుతారు.

وَلِلّٰهِ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ۗ وَيَوْمَ تَقُوْمُ السَّاعَةُ يَوْمَئِذٍ يَّخْسَرُ الْمُبْطِلُوْنَ ﴿٢٧﴾

28. మరియు ప్రతి సమాజం వారిని నీవు మోకరిల్లి[14] ఉండటాన్ని చూస్తావు. ప్రతిజాతి వారిని తమ కర్మపత్రం వైపునకు పిలవడం జరుగుతుంది. (వారితో ఇలా అనబడుతుంది): "ఈ రోజు మీరు చేస్తూ ఉండిన కర్మలకు తగిన ప్రతిఫలం మీకు ఇవ్వబడుతుంది.

وَتَرٰى كُلَّ اُمَّةٍ جَاثِيَةً ۫ كُلُّ اُمَّةٍ تُدْعٰۤى اِلٰى كِتٰبِهَا ۗ اَلْيَوْمَ تُجْزَوْنَ مَا كُنْتُمْ تَعْمَلُوْنَ ﴿٢٨﴾

29. "ఇది మేము వ్రాసిపెట్టిన (మీ కర్మ) పత్రం, ఇది మీ గురించి సత్యమే పలుకు తుంది.[15] నిశ్చయంగా, మేము మీరుచేస్తున్న కర్మలన్నింటినీ వ్రాయిస్తూ ఉండేవారము."

هٰذَا كِتٰبُنَا يَنْطِقُ عَلَيْكُمْ بِالْحَقِّ ۗ اِنَّا كُنَّا نَسْتَنْسِخُ مَا كُنْتُمْ تَعْمَلُوْنَ ﴿٢٩﴾

30. కావున విశ్వసించి సత్కార్యాలు చేస్తూ ఉండిన వారిని, వారి ప్రభువు తన కారుణ్యంలోకి ప్రవేశింపజేసుకుంటాడు.[16] ఇదే ఆ స్పష్టమైన విజయం.

فَاَمَّا الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ فَيُدْخِلُهُمْ رَبُّهُمْ فِيْ رَحْمَتِهٖ ۗ ذٰلِكَ هُوَ الْفَوْزُ الْمُبِيْنُ ﴿٣٠﴾

31. మరియు సత్యాన్ని తిరస్కరించిన వారితో (ఇలా అనబడుతుంది): "మీకు మా సూచనలు వినిపించబడలేదా? కాని మీరు దురహంకారంలో పడిపోయారు మరియు అపరాధులైపోయారు."

وَاَمَّا الَّذِيْنَ كَفَرُوْا ۫ اَفَلَمْ تَكُنْ اٰيٰتِيْ تُتْلٰى عَلَيْكُمْ فَاسْتَكْبَرْتُمْ وَكُنْتُمْ قَوْمًا مُّجْرِمِيْنَ ﴿٣١﴾

---

14. జాసి'యతున్: Kneeling down, మోకరిల్లటం, మోకాళ్ళు భూమికి ఆనించి కూర్చోవడం.

15. చూడండి, **39:69** మరియు **18:49**.

16. అంటే స్వర్గం.

32. మరియు: "నిశ్చయంగా, అల్లాహ్ వాగ్దానం సత్యం మరియు అంతిమ ఘడియను గురించి ఎలాంటి సందేహం లేదు." అని అన్నప్పుడు మీరన్నారు: "ఆ అంతిమ ఘడియ ఏమిటో మాకుతెలియదు. అది కేవలం ఒక ఊహాగానం తప్ప మరేమీ కాదని మేము భావిస్తున్నాము. మేము దానిని ఏ మాత్రం నమ్మేవారము కాము."[17]

وَإِذَا قِيلَ إِنَّ وَعْدَ اللَّهِ حَقٌّ وَالسَّاعَةُ لَا رَيْبَ
فِيهَا قُلْتُم مَّا نَدْرِي مَا السَّاعَةُ إِن نَّظُنُّ
إِلَّا ظَنًّا وَمَا نَحْنُ بِمُسْتَيْقِنِينَ ٣٢

33. అప్పుడు వారిముందు వారు చేస్తూ ఉండిన దుష్కార్యాలు ప్రత్యక్షమవుతాయి. మరియు వారు దేనిని గురించి పరిహాసమాడుతూ ఉన్నారో, అదే వారిని క్రమ్ముకుంటుంది.

وَبَدَا لَهُمْ سَيِّئَاتُ مَا عَمِلُوا وَحَاقَ بِهِم مَّا كَانُوا بِهِ
يَسْتَهْزِئُونَ ٣٣

34. మరియు వారితో ఇలా అనబడు తుంది: "ఈ రోజు మేము మిమ్మల్ని మరచి పోతాము, ఏ విధంగానైతే మీరు మీ సమావేశపు ఈ దినాన్ని మరచిపోయారో! మరియు మీ నివాసం నరకాగ్నియే మరియు మీకు సహాయపడేవారు ఎవ్వరూ ఉండరు."

وَقِيلَ الْيَوْمَ نَنسَاكُمْ كَمَا نَسِيتُمْ لِقَاءَ يَوْمِكُمْ هَٰذَا
وَمَأْوَاكُمُ النَّارُ وَمَا لَكُم مِّن نَّاصِرِينَ ٣٤

35. ఇది ఎందుకంటే, వాస్తవానికి మీరు అల్లాహ్ సూచనలను (ఆయాత్‌లను) పరిహాసంగా తీసుకున్నారు. మరియు ఇహలోక జీవితం మిమ్మల్ని మోసపుచ్చింది. కావున ఈ రోజు వారిని దాని (నరకం) నుండి బయటికి తీయడం జరగదు.[18] మరియు వారికి తమ తప్పులను సరిదిద్దుకునే అవకాశమూ దొరకదు.

ذَٰلِكُم بِأَنَّكُمُ اتَّخَذْتُمْ آيَاتِ اللَّهِ هُزُوًا وَغَرَّتْكُمُ
الْحَيَاةُ الدُّنْيَا ۚ فَالْيَوْمَ لَا يُخْرَجُونَ مِنْهَا
وَلَا هُمْ يُسْتَعْتَبُونَ ٣٥

---

17. అంటే పునరుత్థాన దినం, సత్యం.
18. చూడండి, **6:128** మరియు **43:74**.

***

فَلِلّٰهِ الْحَمْدُ رَبِّ السَّمٰوٰتِ وَرَبِّ الْاَرْضِ رَبِّ الْعٰلَمِيْنَ ﴿٣٦﴾

36. ఇక సర్వస్తోత్రాలకు అర్హుడు అల్లాహ్ మాత్రమే! ఆయనే ఆకాశాలకూ ప్రభువు మరియు భూమికీ ప్రభువు; ఆయనే సర్వలోకాలకు కూడా ప్రభువు!

وَلَهُ الْكِبْرِيَآءُ فِى السَّمٰوٰتِ وَالْاَرْضِ ۖ وَهُوَ الْعَزِيْزُ الْحَكِيْمُ ﴿٣٧﴾

37. ఆకాశాలలో మరియు భూమిలో ఘనత (మహనీయత) ఆయనకే చెందుతుంది. మరియు ఆయనే సర్వశక్తి మంతుడు, మహా వివేకవంతుడు.

*****